www.epaper.asthram.com

సామాన్యుడి అస్త్రం
తెలుగు దినపత్రిక

శనివారం
08.11.2025
సంగారెడ్డి

సంపుటి : 01 సంచిక : 72 పేజీలు : 08 వెల:5/-





www.asthram.com

# సామాన్యుడి అస్త్రం

తెలుగు దినపత్రిక

శనివారం 8
నవంబర్ 2025

సంగారెడ్డి సంచిక :72 సంపుటి : 1 పేజీలు : 8 వెల : రూ. 5/-

## 100 బిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరిన ఎస్‌బీఐ

ఇటీవలి సెప్టెంబర్ త్రైమాసికంలో ఊహించిన దానికంటే ఎక్కువ లాభాలు సాధించిన ప్రభుత్వ రంగ దిగ్గజం ఎస్‌బీఐ కొత్త మైలురాయిని చేరుకుంది. బ్యాంకు తొలిసారి 100 బిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ మార్కును దాటింది. మన కరెన్సీలో ఇది రూ. 8.86 లక్షల కోట్లకు సమానం. ఈ ఏడాది పండుగ సీజన్ సందర్భంగా రిటైల్ కొనుగోళ్లు పెరగడంతో మెరుగైన క్రెడిట్ వృద్ధి నమోదైంది. ఇదే సమయంలో సెప్టెంబర్ నాటికి రూ. 44.20 లక్షల కోట్ల అడ్వాన్సులు, రూ. 55.92 లక్షల కోట్ల డిపాజిట్లతో కలిపి రూ. 100 లక్షల కోట్ల వ్యాపార మార్కును ఎస్‌బీఐ చేరుకుంది. మార్కెట్ క్యాప్ పరంగా దేశీయంగా 228 బిలియన్ డాలర్ల(రూ. 20.21 లక్షల కోట్ల)తో అగ్రస్థానంలో ఉంది.

# తమాషా చేస్తే తాటతీస్తా



- ప్రైవేట్ కాలేజీలకు సీఎం రేవంత్ వార్నింగ్
- అడ్డగోలుగా ఫీజులు పెంచి.. రీయింబర్స్‌మెంట్ అడుగుతున్నారు: సీఎం రేవంత్‌రెడ్డి
- "మా హయాంలోని బకాయిలు ముందు చెల్లిస్తాం
- విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడొద్దు
- బకాయిలు ఇవాళ కాకపోతే రేపు వసూలవుతాయి
- కాలేజీలు బంద్ పెడితే విద్యార్థులు కోల్పోయిన సమయం తిరిగి వస్తుందా?
- "బ్లాక్ మెయిల్ చేస్తామంటే ప్రభుత్వం ఊరుకోదు

హైదరాబాద్

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ తెలంగాణలో ఉన్నత విద్యాసంస్థలు చేపట్టిన బంద్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. విడతల వారీగా బకాయిలు చెల్లిస్తామ న్నారు. "మా హయాంలోని బకాయిలు ముందు చెల్లిస్తాం. విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడొద్దు. బకాయిలు ఇవాళ కాకపోతే రేపు వసూలవుతాయి. కాలేజీలు బంద్ పెడితే విద్యార్థులు కోల్పోయిన సమయం తిరిగి వస్తుందా? రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులకు ఇబ్బంది లేదు. అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ వెళ్లాలి. రాష్ట్రానికి నెలకు రూ.18వేల కోట్ల ఆదాయం వస్తోంది. జీతాలు, వడ్డీలు, ఇతర ఖర్చులు పోనూ మిగిలేది రూ.5వేల కోట్లే. ఈ ఆదాయంతో రాష్ట్రాన్ని ఎలా నడపాలో చెప్పండి. ప్రభుత్వాన్ని బ్లాక్ - మిగతా3లో



రేవంత్ రెడ్డికి ఓటమి భయం పట్టింది..

# అందుకే ప్రజలను భయపెడుతున్నాడు

- రేవంత్ రెడ్డి ఇంట్లో నుంచి డబ్బులు ఇస్తున్నాడా లేదా ఆయన నాయన డబ్బులు ఇస్తున్నాడా
- రెండేండ్ల కాంగ్రెస్ అరాచకపు పాలనకు జూబ్లీహిల్స్ ప్రజలు బుద్ధి చెప్తారు
- ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే మరో మూడేండ్లు రాష్ట్ర ప్రజలు నరకయాతన అనుభవించాలి
- కేసీఆర్ పదేండ్ల పాలనలో వికాసం, రేవంత్ రెడ్డి రెండేండ్ల పాలనలో అంతా విధ్వంసం
- కంటోన్మెంట్ ఉప ఎన్నిక ముందు ఇచ్చిన ఒక్క హామీ కూడా రేవంత్ రెడ్డి అమలు చేయలేదు



## పైలట్‌ను నిందించొద్దు

- విమాన ప్రమాదంపై తప్పుడు నివేదికలు ఇవ్వడంపై ఆందోళన
- ప్రాథమిక నివేదికలో పైలట్ వైపు నుండి ఎటువంటి తప్పు లేదు
- ఇటువంటి తప్పుడు నివేదికలు రూపొందించకూడదు
- సుప్రీంకోర్టు



## చర్చలు సఫలం..

### తెరుచుకోనున్న కాలేజీలు

- ప్రైవేట్ కళాశాలలు అడిగిన రూ. 1,500 కోట్లలో రూ. 600 కోట్లు ఇప్పటికే విడుదల చేశాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- మరో రూ. 600 కోట్లు వెంటనే విడుదల చేస్తాం
- మిగిలిన రూ. 300 కోట్లు త్వరలో క్లియర్ చేస్తాం
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కమిటీ ఏర్పాటు

హైదరాబాద్

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రైవేట్ కళా శాలల యాజమాన్యాల తో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. శుక్రవారం హైదరాబాద్‌లో ఈ అంశంపై ప్రైవేట్ కళాశా లల యాజమా న్యంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చర్చలు జరిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల పట్ల ప్రైవేట్ కాళాశాలల యాజమాన్యం సానుకూలంగా స్పందిం చింది. దీంతో శనివారం నుంచి ప్రైవేట్ కళాశాలు తెరుచుకోనున్నాయి.

- మిగతా3లో

# ఇక్కడ అవకాశాలు పుష్కలం.. పెట్టుబడులు పెట్టండి

- ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచిన తెలంగాణలో అవకాశాలు పుష్కలం
- ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలి
- కేవలం పెట్టుబడులను ఆకర్షించడమే కాక, గ్లోబల్ ఎకానమీకి సపోర్ట్ ఇచ్చేలా, లాంగ్-టర్మ్ వాల్యూ క్రియేషన్ కు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుంది
- టీ-హబ్, టీ- వర్క్స్, వీ హబ్ లను వరల్డ్ ట్రేడ్ సెంటర్ - యూటా, సిలికాన్ స్లోప్స్ - యూటా టెక్ స్టార్టప్‌లతో అనుసంధానించేలా చొరవ చూపాలి





## ట్రంప్ భారత పర్యటనపై సమాచారం లేదు

- విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్
- రహస్య, చట్టవిరుద్ధమైన అణు కార్యకలాపాలు పాకిస్తాన్ చరిత్రలోనే ఓ భాగం
- స్మగ్లింగ్, ఎగుమతి, ఉల్లంఘనలు, రహస్య భాగస్వామ్యాలు తెలిశాయి



## వందేమాతరం మూలభావం అదే

- వందేమాతరం 150 ఏళ్ల స్మారకోత్సవాలు నిర్వహించుకుంటున్నాం
- 1937లో వందేమాతరం గేయంలో కొన్ని చరణాలను తొలగించారు
- ఈ గేయం మనందరినీ పురాణ ఇతిహాసాల్లోకి తీసుకెళ్తుంది
- 'వందేమాతరం శబ్దం ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది
- భవిష్యత్తుకు సరికొత్త భరోసా ఇస్తుంది.
- 'వందేమాతరం స్మారక స్టాంపు, నాణెం విడుదల చేశాం



## షుగర్ ఉన్నోళ్లకు నో వీసా!

- ట్రంప్ సంచలన ప్రకటన
- షుగర్, ఒబెసిటీ ఉన్నవాళ్లకు యూఎస్ వీసా ఇవ్వలేమని స్పష్టం
- ఈ నిబంధనలు వెంటనే అమలు చేయాలని ఎంబసీలు, కాన్సులర్ కార్యాలయాలకు ట్రంప్ యంత్రాంగం ఆదేశాలు జారీ

## రోడ్ షోలు, కార్నర్ మీటింగ్లకు

# భారీగా జన సమీకరణ

- పొరుగు సెగ్మెంట్ల నుంచి పార్టీ కార్యకర్తల తరలింపు

హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో ప్రధాన పార్టీలు నిర్వహిస్తున్న రోడ్ షోలు, కార్నర్ మీటింగ్లను ఆయా పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. రోడ్ షో, కార్నర్ మీటింగ్లు విజయవంతం చేసేందుకు భారీగా జన సమీకరణ చేస్తున్నారు. స్థానిక కార్యకర్తలతో పాటు చుట్టుపక్కల నియోజకవర్గాల నుంచి పెద్దసంఖ్యలో కార్యకర్తలను తరలిస్తుండటంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఏ పార్టీ రోడ్లు, కార్నర్ మీటింగ్లు నిర్వహించినా భారీసందడి నెలకొంటోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఈ ఉప ఎన్నిక బాధ్యతలను రాష్ట్రంలోని ముఖ్యనేతలు, మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలకు అప్పగించారు. రోడ్ షోలకు జనసమీకరణ చేపట్టే నేతలకు ప్రత్యేక ప్యాకేజీలిస్తున్నారు. - మిగతా3లో



# పైలట్‌ను నిందించొద్దు



**న్యూఢిల్లీ:** గత జూన్‌లో అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదానికి సంబంధించిన కేసులో కేంద్ర ప్రభుత్వానికి, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీసీసీఏ)కి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ ప్రమాదంపై న్యాయ విచారణ కోరుతూ ఎయిర్ ఇండియా పైలట్ తండ్రి దాఖలు చేసిన పిటిషన్‌కు స్పందిస్తూ, సుప్రీం కోర్టు ఈ నోటీసు జారీ చేసింది. పైలట్ తండ్రి.. ఈ ఘటనకు సరైన కారణాన్ని గుర్తించేందుకు, జవాబుదారీతనం నిర్ధారించేందుకు స్వతంత్ర దర్యాప్తును కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా న్యాయమూర్తులు జోయ్‌మల్య బాగ్చి , జె సూర్యకాంత్‌లతో కూడిన ధర్మాసనం.. విమాన ప్రమాదంపై తప్పుడు నివేదికలు ఇవ్వడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషాద సంఘటనకు పైలట్‌ను బాధ్యుడిని చేస్తూ, నిందించకూడదని ధర్మాసనం పేర్కొంది. 'ఎయిర్ ఇండియా విమాన ప్రమాదానికి బాధ్యుడంటూ పైలట్‌ను నిందించకూడదు. ఇది ఒక విషాద ఘటన. ప్రాథమిక నివేదికలో పైలట్ వైపు నుండి ఎటువంటి తప్పు లేదని తేలింది. ఇటువంటి తప్పుడు నివేదికలు రూపొందించకూడదు. ఇటువంటి ఘటనలపై పరిశోధించేందుకు నిర్దిష్ట నిబంధనలున్నాయని జస్టిస్ బాగ్చి అన్నారు. దివంగత పైలట్ తండ్రి, పిటిషనర్ వ్యక్తం చేసిన బాధను, న్యాయమైన దర్యాప్తు ప్రాముఖ్యతను అర్థం చేసుకున్నట్లు ధర్మాసనం పేర్కొంది. పిటిషనర్ తరపున వాదించిన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ మాట్లాడుతూ, 'నియమం 11 అనేది ప్రమాదాలకు సంబంధించినది. నిబంధన తొమ్మిది ప్రకారం ప్రాథమిక దర్యాప్తు మాత్రమే నిర్వహించారు. మేము స్వతంత్ర దర్యాప్తును కోరుతున్నాం. ఈ విమాన ప్రమాదంపై అంతర్జాతీయ స్థాయిలో దర్యాప్తు జరిగేలా చూడాలని' కోర్టును కోరారు. 2025, జూన్ 12న మధ్యాహ్నం 1:38 గంటలకు అహ్మదాబాద్ నుండి లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం ఏఐ 171 టేకాఫ్ అయిన కొద్ది క్షణాలకే కూలిపోయింది. ఈ ప్రమాదంలో 241 మంది ప్రయాణికులు సహా మొత్తం 265 మంది మృతి చెందారు. గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ కూడా ఈ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో కన్నుమూశారు.

# ట్రంప్ భారత పర్యటనపై సమాచారం లేదు



పాకిస్తాన్, అమెరికా తదితర దేశాలతో భారతదేశ సంబంధాలపై విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది. అణు పరీక్షలకు సంబంధించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడారు. ఈ విషయం భారత్‌కు పూర్తిగా తెలుసునని.. రహస్య, చట్టవిరుద్ధమైన అణు కార్యకలాపాలు పాకిస్తాన్ చరిత్రలోనే ఓ భాగమని ఆయన విమర్శించారు. స్మగ్లింగ్, ఎగుమతి, ఉల్లంఘనలు, రహస్య భాగస్వామ్యాలు తెలిశాయని.. ఎప్పటికప్పుడు పాక్ అణు కార్యక్రమాల గురించి అంతర్జాతీయ సమాజానికి చెబుతూనే ఉన్నామన్నా రు. పాక్ అణుపరీక్షలపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలను గమనిస్తూనే ఉన్నామన్నారు. ట్రంప్ భారత పర్యటన గురించి చేసిన ప్రకటనపై ప్రశ్నకు సమాధానమిస్తూ.. 'ట్రంప్ భారత పర్యటనపై తాను ఏమీ స్పందించలేనని.. ఎందుకంటే చెప్పేందుకు తన వద్ద ఏమీ లేదన్నారు. భారత్‌లో ట్రంప్ పర్యటనపై మా వద్ద సమాచారం ఏదీ లేదన్నారు. వైట్‌హౌస్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. ట్రంప్ ప్రధాని నరేంద్ర మోదీతో చర్చలు బాగా జరుగుతున్నాయని.. త్వరలోనే భారత్‌లో పర్యటించనున్నట్లుగా వ్యాఖ్యానించారు. భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తగ్గించిందని.. మోదీ తన స్నేహితుడని.. ఇద్దరం మాట్లాడుకుంటున్నామన్నారు. తనను భారత్‌లో పర్యటించాలని మోదీ ఆహ్వానించినట్లుగా తెలిపారు. త్వరలోనే తేదీని నిర్ణయిస్తామని.. ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి, తాను భారత్‌కు వెళ్తానని చెప్పుకొచ్చారు. ఇటీవల ట్రంప్ సీబీఎస్ న్యూస్ ఇంటర్వ్యూలో రష్యా, చైనా, ఉత్తర కొరియా, పాకిస్తాన్ వంటి దేశాలు అణ్వాయుధాలను పరీక్షిస్తున్నాయని.. అమెరికా మాత్రమే పరీక్షలను నిలిపివేసిందని ట్రంప్ పేర్కొన్నారు. ఇతర దేశాలు అణు పరీక్షలు చేస్తున్న సమయంలో.. మనం కూడా అదే పని చేయాలన్నారు. ఇండో-పసిఫిక్ క్వాడ్ కీలకమైందని ప్రభుత్వం తెలిపింది. జపాన్, ఆస్ట్రేలియా, యునైటెడ్ స్టేట్స్, భారత్‌తో కూడిన వ్యూహాత్మక సంస్థ అయిన క్వాడ్ గురించి అడిగిన ప్రశ్నకు రణధీర్ జైస్వాల్ స్పందిస్తూ.. క్వాడ్ భాగస్వామ్య దేశాలు ఇండో-పసిఫిక్ ప్రాంతానికి సంబంధించిన క్లిష్టమైన అంశాలపై చర్చించేందుకు ఒక ముఖ్యమైన వేదికగా భావిస్తున్నారన్నారు. క్వాడ్ నిరంతరం అభివృద్ధి చెందుతోందని.. అక్టోబర్ 29-30 తేదీల్లో ముంబయిలో జరిగిన క్వాడ్ పోర్ట్స్ ఆఫ్ ది ఫ్యూచర్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. ఇండియా మారిటైమ్ వీక్ ఒక ముఖ్యమైన కార్యక్రమన్నారు. ఈ సందర్భంగా ఆఫ్ఘనిస్తాన్‌కు సంబంధించిన సమస్యలపై స్పందించారు. ఆఫ్ఘనిస్తాన్ విదేశాంగ మంత్రి భారత్‌ను సందర్శించిన విషయం తెలిసిందే. రెండు దేశాల మధ్య అభివృద్ధి, సహకారం చర్చించామన్నారు. విదేశాంగ మంత్రి డాక్టర్ జైశంకర్, ఆఫ్ఘన్ కౌంటర్‌లో ఫోన్‌లో మాట్లాడార న్నారు. రాయబార కార్యాలయం, కార్యకలాపాలు, కాబూల్ లోని మా సాంకేతిక మిషన్‌ను రాయబార కార్యాలయానికి అప్‌గ్రేడ్ చేయడం విషయానికొస్తే, పరిస్థితిని వివరంగా చర్చించాల న్నారు. విస్తరణకు సంబంధించిన అన్ని అంశాలు పరిశీలన లోనే ఉన్నాయని.. త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు.

# దిల్లీ ఏటీసీలో వైఫల్యం.. సైబర్ దాడే కారణమా?



దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రెండు, మూడు రోజులుగా సాంకేతిక సమస్యతో వందలాది విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలో సమస్యే దీనికి కారణంగా భావిస్తున్నారు. సమస్యను పరిష్కరించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నప్పటికీ.. సైబర్ దాడే దీనికి కారణమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏటీసీ ఆటోమేషన్ వ్యవస్థలోకి మాల్‌వేర్‌ను చొరబాటు వల్లే ఈ సమస్య తలెత్తిందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ డేటాకు అనుసంధానంగా ఉండే ఆటోమేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్ లో సాంకేతిక సమస్య వల్లే అంతరాయం ఏర్పడిందని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా పేర్కొంది. దీన్ని పరిష్కరించేందుకు సాంకేతిక బృందాలు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. దిల్లీ ఎయిర్‌పోర్టు కూడా ఇదే విషయాన్ని వెల్లడిస్తూ సామాజిక మాధ్యమంలో పోస్టు చేసింది. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టు టెర్మినళ్ల లోపల, బోర్డింగ్ గేట్ల వద్ద భారీ సంఖ్యలో ప్రయాణికులు క్యూలో వేచిచూడాల్సి వస్తోంది.

**మాల్‌వేర్ చొరబాటు..?**

ఈ సాంకేతిక సమస్య కారణంగా విమానాల రాకపోకల అప్‌డేట్‌లను ఏటీసీ ఆటోమేటిక్‌గా పొందలేకపోతున్నట్లు తెలిసింది. దీంతో ఏటీసీ ఆటోమేషన్ వ్యవస్థలో వైఫల్యం చోటుచేసుకుందా? అన్న కోణంలో సంబంధిత విభాగాలు దర్యాప్తు మొదలుపెట్టాయి. మాల్‌వేర్ చొరబాటును సాఫ్ట్‌వేర్ సాయంతో గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. సిస్టమ్‌లో కొన్ని కీలక అప్‌డేట్‌లు లేవని, ఎప్పటికప్పుడు బ్యాకప్ వ్యవస్థ కూడా కనిపించలేదని గుర్తించినట్లు సమాచారం. అయితే, ఇవన్నీ ప్రాథమిక అంచనాలేనని, పూర్తి కారణాలను విశ్లేషిస్తున్నట్లు సంబంధిత అధికారులు చెప్పినట్లు పలు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. మరోవైపు, ఈ సైబర్‌దాడి జరిగినట్లు వస్తున్న వాదనను ప్రభుత్వవర్గాలు తోసిపుచ్చినట్లు తెలుస్తోంది.

**300 విమానాలపై ఎఫెక్ట్..**

దిల్లీ ఐజీఐ ఎయిర్‌పోర్టు దేశంలోనే అత్యంత రద్దీ విమానాశ్రయం. ఇక్కడ నుంచి నిత్యం దాదాపు 1500లకు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తాయి. కొన్ని రోజులుగా ఇక్కడి విమాన ప్రయాణాలకు తరచూ అంతరాయం కలుగుతోంది. విమాన నావిగేషన్ వ్యవస్థపై ప్రభావితం చూపే జీపీఎస్ స్పూఫింగ్ ఇందుకు కారణనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఊహించని విధంగా ఎయిర్ ట్రాఫిక్ పెరగడంతో అనేక విమానాలను దారి మళ్లించాల్సి వస్తోంది. శుక్రవారం ఒక్కరోజే 300లకుపైగా దేశీయ, అంతర్జాతీయ సర్వీసులపై ప్రభావం పడింది.

**ఏమిటీ జీపీఎస్ స్పూఫింగ్?**

నావిగేషన్ వ్యవస్థను ప్రభావితం చేసి నకిలీ జీపీఎస్ ద్వారా విమానాలను దారి మళ్లించే ప్రక్రియను జీపీఎస్ సిగ్నల్ స్పూఫింగ్‌గా వ్యవహరిస్తారు. నిజమైన శాటిలైట్ సిగ్నల్స్‌ను అడ్డుకొని ఆ స్థానంలో నకిలీ సంకేతాలను పంపి జీపీఎస్ రిసీవర్‌ను తప్పుదోవ పట్టిస్తాయి. ఫలితంగా.. ప్రస్తుతమున్న ప్రదేశం, సమయాన్ని తప్పుగా చూపించేలా చేస్తాయి. పౌర విమానాలే లక్ష్యంగా అంతర్జాతీయ రూట్‌లలో ఇటీవల ఇలాంటివి చోటుచేసుకుంటున్నాయి. ఈ ఘటనలపై ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ మన దేశంలోనూ ఇవి ప్రభావం చూపడం ఆందోళన కలిగించే విషయం.

## వందేమాతరం మూలభావం అదే



**న్యూ ఢిల్లీ :** వందేమాతరం గీతం ఒక స్వప్నం, ఒక సంకల్పం..ఒక మంత్రం, దేశమాత ఆరాధన, సాధన అని ప్రధాని నరేంద్ర మోడీ కొనియాడారు. వందేమాతరం.. మనల్ని పురాణ ఇతి హాసాల్లోకి తీసుకెళ్తుందని, భవిష్యత్తుకు సరికొత్త భరోసా ఇస్తుందని జోష్యం చెప్పారు. వందేమాతరం సామూహిక గీతాలాపన అద్భుత అనుభవమని, ఒకే లయ, స్వరం, భావంతో గీతాలాపన హృదయాన్ని స్పందింపజేస్తుందని తెలిపారు. నేటితో 'వందేమాతరం' గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఢిల్లీలో ఇందిరాగాంధీ స్టేడియంలో వందేమాతరం స్మారకోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. "వందేమాతరం" 150వ స్మారకోత్సవం, సామూహిక గీతాలాపనలో కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్రమంత్రి షెకావత్, ఢిల్లీ సిఎం రేఖాగుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలో పిఎం మోడీ ప్రసంగించారు. ఏడాది పొడువునా కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్రం నిర్ణయం తీసుకుందని, వందేమాతరం 150 ఏళ్ల స్మారకోత్సవాలు జరుపుకుంటున్నామని తెలియజేశారు. వందేమాతరం స్మారకోత్సవాలు దేశ ప్రజలకు ప్రేరణ ఇస్తాయని, వందేమాతరం స్మారక స్టాంపు, నాణెం విడుదల చేశామని అన్నారు. ప్రతి గీతానికి ఒక మూల భావం, సందేశం ఉంటుందని, వందేమాతరం మూల భావం, సంకల్పం భారత్ అని మోడీ పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి నిలదొక్కుకునే ప్రేరణగా నిలిచిందని, పూర్వీకులు భారత్ ను సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దుతారని ప్రశంసించారు. భారత్ అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని అమరత్వం పొందిందని, బంకించంద్ర ఆనంద మఠ్ ఉపన్యాసం మాత్రమే కాదని ఠాగూర్ చెప్పారని గుర్తు చేశారు. ఆనంద మఠ్ ఉపన్యాసం..భారత్ స్వప్నం అని ఠాగూర్ చెప్పారని, ఆనందమఠ్ లో వందేమాతరం ప్రసంగం.. బంకించంద్ర భావాలు నిక్షిప్తమై ఉన్నాయని అన్నారు. ఆంగ్లేయుల పాలనలోనూ వందేమాతరం గీతం బందీగా లేదని, బానిసత్వపు రోజుల్లోనూ వందేమాతరం గీతం అమరత్వం పొందిందని హర్షం వ్యక్తం చేశారు. వందేమాతరం గీతాలాపన కోట్లమంది భారతీయుల్లో కొత్త శక్తిని రేకెత్తిస్తోందని, సాధించలేని సంకల్పం లేదని, మన భారతీయులు సాధించలేని లక్ష్యం లేదని మోడీ స్పష్టం చేశారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం ఈ దేశ స్వరంగా మారిందన్నారు. ప్రతి భారతీయుడి తమ మనోభావాలను ఆ గేయం ద్వార వ్యక్తపరిచారన్నారు. కానీ 1937లో దురదృష్టవశాత్తు, వందేమాతరం గేయంలోని కొన్ని చరణాలను తొలగించారని, వందేమాతర గీత విభజన దేశ విభజనకు బీజం వేసిందన్నారు. జాతి నిర్మాణం కోసం రూపొందించిన ఈ మహామంత్రం పట్ల ఎందుకు అన్యాయం జరిగిందో ఈ తరం యువత తెలుసుకోవాలన్నారు. ఇలాంటి విచ్ఛిన్నకర మైండ్‌సెట్ దేశానికి ఇప్పటికీ సవాలే అన్నారు. ఉగ్రవాదం పేరుతో శత్రువులు మన భద్రత, గౌరవంపై దాడి చేస్తే, అప్పుడు భారత్ ఎలా దుర్గ అవతారాన్ని ఎత్తిందో ప్రపంచ వీక్షించినట్లు పేర్కొన్నారు. వందేమాతర గీతం కొత్త స్ఫూర్తిని ఇస్తుందని, ఈ దేశాన్ని కొత్త శక్తితో నింపుతోందన్నారు. వందేమాతరం అంటే ఓ పదం, ఓ మంత్రం, ఓ శక్తి, ఓ కళ, ఓ పట్టుదల అని ఆయన అన్నారు. భారతమాత పట్ల ఇది భక్తికి నిదర్శనమన్నారు. మన చరిత్రను చాటుతూ.. మనకు కొత్త ఉత్తేజాన్ని ఇస్తుందన్నారు. అనుకున్నది సాధించలేనిది ఏమీ లేదని, భారతీయులు దేన్నైనా సాధించగలరని, జ్ఞానం..విజ్ఞానం.. సాంకేతిక నిండిన దేశాన్నినిర్మించాలన్నారు.

## షుగర్ ఉన్నోళ్లకు నో వీసా!



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. వీసాల విషయంలో సంచనల ప్రకటన చేశారు. షుగర్, ఒబెసిటీ ఉన్నవాళ్లకు యూఎస్ వీసా ఇవ్వలేమని స్పష్టం చేశారు. ఈమేరకు కొత్త గైడ్‌లైన్స్ కూడా రిలీజ్ చేశారు. ఈ నిబంధనలు వెంటనే అమలు చేయాలని ఎంబసీలు, కాన్సులర్ కార్యాలయాలకు ట్రంప్ యంత్రాంగం ఆదేశాలు జారీ చేసినట్లు.. అంతర్జాతీయ మీడియా కథనాలు చెబుతున్నాయి. అమెరికా వీసా కోసం అప్లై చేసుకునే దరఖాస్తుదారుల ఆరోగ్య పరిస్థితిని.. ఇమ్మిగ్రేషన్ అధికారులు పరిశీలించేవారు. స్క్రీనింగ్ టెస్టుల ద్వారా టీబీ వంటి అంటువ్యాధులు ఉన్నాయా? లేదా?, అనే చెక్ చేసేవారు. ఇప్పుడు తాజాగా.. డయాబెటిస్, ఊబకాయం వంటి దీర్ఘకాలిక వ్యాధులుంటే.. అలాంటి వారికి కూడా వీసా ఇచ్చే అవకాశం లేదు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారిని అమెరికాలోకి ఆహ్వానిస్తే.. భవిష్యత్తులో కొన్ని సమస్యలు తలెత్తుతాయని, ఆ సమస్యలు ప్రభుత్వ ఖజానాపై ప్రభావం చూపిస్తాయని భావిస్తున్నారు. కాబట్టి కొన్ని వ్యాధులున్న దరఖాస్తుదారులు అమెరికాలోకి రానివ్వకపోతే సమస్యలకు చెక్ పెట్టినట్లే అవవుతుంది. ఇలాంటివన్నీ ఆలోచించే.. డయాబెటిస్, ఊబకాయం ఉండే వారికి అమెరికా వీసా ఇవ్వకూడదని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. షుగర్, ఒబెసిటీ వంటి వ్యాధులకు దీర్ఘకాలిక చికిత్స అవసరమవుతుంది. దీనికోసం లక్షల డాలర్లను ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇది కుటుంబ సభ్యులపై ఎక్కువ ఆర్థిక భారం మోపుతోంది. దీనికి ప్రభుత్వం ఏమైనా సాయం అందించాలా?, లేకుంటే ప్రభుత్వం సహాయం లేకుండా.. కుటుంబ సభ్యులే సొంతంగా ఖర్చును భరించగలరా? అనే విషయం మీద స్పష్టత ఏర్పరచుకోవాలి. వలసదారుల వల్ల.. అమెరికాలో ఇబ్బందులు తలెత్తకూడదని ట్రంప్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు కఠినమైన చర్యలు తీసుకుంటూ ఉంది. ఇప్పటి వరకు అనేక కారణాల వల్ల వీసాలను రిజెక్ట్ చేసిన సందర్భాలు చాలానే ఇన్నాయి. కానీ.. ఇప్పుడు మధుమేహం, ఊబకాయం ఉంటే కూడా అమెరికా వీసా పొందలేరు. దీన్నిబట్టి చూస్తే.. వీసాలను మరింత పరిమితం చేయడానికి ట్రంప్ కంకణం కట్టుకున్నట్లు అర్థమవుతోంది.

## శబరిమలలో ప్లాస్టిక్ షాంపూ, సబ్బులపై నిషేధం




**తిరువనంతపురం:** శబరిమలలో ప్లాస్టిక్ , షాంపూ సాచెట్లను విక్రయించడంతో ఉపయోగించడాన్ని హైకోర్టు నిషేధించింది. పంబ నదితో సహా పంబ నదిలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్న తీవ్రమైన పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని డివిజన్ బెంచ్ ఈ చర్య తీసుకుంది. ఈ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డును హైకోర్టు దేవస్వం బెంచ్ ఆదేశించింది. షాంపూ సాచెట్లతో పాటు , పంబ , సన్నిధానం మరియు ఎరుమేలిలలో రసాయన కుంకుమ అమ్మకాలను కూడా నిషేధించారు. ఈ ఉత్పత్తులు పర్యావరణానికి హానికరం అనే కారణంతో కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. మండల - మకరవిళక్కు సీజన్ 16 వ తేదీ నుండి ప్రారంభం కానుంది. అప్పట్నుంచి హైకోర్టు ఆదేశాలు అమల్లోకి రానున్నాయి. ఘన వ్యర్థాలను పారవేయకుండా నిరోధించడానికి కఠినమైన తనిఖీలు నిర్వహించాలని ఎరుమేలి గ్రామ పంచాయతీని సైతం కోర్టు ఆదేశించింది.

# ప్రైవేటు విద్యాసంస్థలు తమాషా చేస్తే తాటతీస్తా

-మొదటిపేజీ తరువాయి

మెయిల్ చేస్తున్నారా? కాలేజీలను బంద్ చేయించినవారితో చర్చించేదేముంది? ఏ కాలేజీ ఎంత డొనేషన్ వసూలు చేస్తుందో నాకు తెలుసు. కాలేజీలో నిబంధనలు పాటించకపోతే ఎలా? ఇష్టానుసారం ఫీజులు పెంచుకుంటూ పోతే ఎలా? విద్య వ్యాపారం కాదు.. విద్యను సేవగా భావించాలి. రాజకీయ నేతలు అండగా ఉన్నారని విద్యార్థులతో ఆడుకోవద్దు. అడ్డగోలుగా ఫీజులు పెంచుకుని వచ్చి రీయింబర్స్‌మెంట్ అడుగుతున్నారు. కాలేజీలకు అనుమతుల విషయంలో ఎన్నో అక్రమాలు ఉన్నాయి. కాలేజీల యజమానులు ప్రభుత్వాన్నే బ్లాక్ మెయిల్ చేస్తారా? బీసీ నేత ఆర్.కృష్ణయ్య కూడా అమాయకంగా వాళ్ల ఉచ్చులో పడ్డారు. ఆర్.కృష్ణయ్య, మందకృష్ణ ముందుకొస్తే వాళ్ల చేతికే చిట్టా ఇస్తా. నాలుగు నెలలు ప్రభుత్వాన్ని మీరే నడపండి" అని సీఎం అన్నారు. "బ్లాక్ మెయిల్ చేస్తామంటే ప్రభుత్వం ఊరుకోదు.. సంఘాలు అంటూ పైరవీల కోసమే వస్తున్నారు. అరోరా కాలేజీ రమేష్‌కి ఎన్ని అనుమతులు ఇవ్వాలి?. సహకరించాల్సిన వాళ్లే కాలేజీలు బంద్ చేశారు. వచ్చే ఏడాది ఎన్ని డొనేషన్లు తీసుకుంటారో చూద్దాం. రేపు ఫీజులు



అడగకుండా ఉంటారా? అంటూ సీఎం రేవంత్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై రేవంత్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు."గత కాంగ్రెస్ ప్రభుత్వంలోనే హైదరాబాద్ గ్రోత్ ఇంజిన్‌గా మారింది. మెట్రో,ఔటర్ రింగ్ రోడ్, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఇలా అన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే ఇచ్చింది. నేడు ఉన్న అంతర్జాతీయ, జాతీయ సంస్థలు అన్ని గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే వచ్చాయి. హైదరాబాద్‌లో? చెప్పుకోదగ్గ ప్రాజెక్టులు కట్టింది కాంగ్రెస్సే. కొడుకు భవిష్యత్ కోసం, వాస్తు కారణంగానే కేసీఆర్ సచివాలయం కూలగొట్టారు." అని రేవంత్ మండిపడ్డారు. "వరదల్లో హైదరాబాద్ మునిగిపోతే కేంద్రం నుంచి కిషన్‌రెడ్డి చిల్లి గవ్వ తీసుకురాలేదు. కాళేశ్వరం కట్టడం, కూలడం మూడేళ్లలోనే జరిగిపోయింది. హైదరాబాద్ ఎవరి హయాంలో అభివృద్ధి చెందిందో ఆలోచన చేయండి. ఆనాడు మిగుల బడ్జెట్‌తో కేసీఆర్‌కు రాష్ట్రాన్ని అప్పగించాం. సచివాలయం కారణంగా ఎవరికైనా ఉద్యోగాలు వచ్చాయా?. కొత్త సచివాలయం నిర్మాణం వల్ల ప్రజలకు అణా పైసా మేలు జరిగిందా?. హైదరాబాద్‌ను మహానగరంగా తీర్చిదిద్దింది కాంగ్రెస్ కాదా?" అంటూ రేవంత్ ప్రశ్నించారు. కాగా, ఫీజురీయింబర్స్‌మెంట్‌పై ప్రైవేటు విద్యాసంస్థలు ఇటీవల బంద్‌కు పిలుపునిచ్చాయి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశాయి. లేకపోతే నిరవధిక ఆందోళన చేపడతామని హెచ్చరించాయి. తెలంగాణ ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో విద్యాసంస్థలను కొనసాగించడం చాలా కష్టంతో కూడుకున్నదని ప్రైవేటు విద్యాసంస్థలు ఆవేదన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలోనే ప్రైవేటు విద్యాసంస్థలపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్ అయినట్లు తెలుస్తోంది.

# చర్చలు సఫలం.. తెరుచుకోనున్న కాలేజీలు

-మొదటిపేజీ తరువాయి

డిప్యూటీ సీఎం మల్లు..

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కళాశాలలు అడిగిన రూ. 1,500 కోట్లలో రూ. 600 కోట్లు ఇప్పటికే విడుదల చేశామని గుర్తు చేశారు. మరో రూ. 600 కోట్లు వెంటనే విడుదల చేస్తామని ఆయన ప్రకటించారు. మిగిలిన రూ. 300 కోట్లు త్వరలో క్లియర్ చేస్తామని చెప్పారు. అయితే ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కమిటీలో ఉన్నతాధికారులు, కళాశాల యాజమాన్య ప్రతినిధులు సభ్యులుగా ఉంటారన్నారు.

**పాతి అధ్యక్షుడు రమేష్ రియాక్షన్**

ప్రభుత్వంతో తమ చర్చలు సఫలం కావడంతో అన్ని నిరసన కార్యక్రమాలు రద్దు చేస్తున్నట్లు పాతి సంఘం అధ్యక్షుడు నిమ్మటూరి రమేష్ ఈ సందర్భంగా ప్రకటించారు. అయితే ఉన్నతాధికారులపై తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయ్యలేదని స్పష్టం చేశారు. అయితే తమ సమ్మె కారణంగా పరీక్షలు నిలిచిపోయినందుకు చింతిస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయాలతో చర్చించి పరీక్షలు త్వరగా నిర్వహిస్తామని నిమ్మటూరి రమేష్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఇక ప్రభుత్వంతో చర్చలు సఫలం కావడంతో శనివారం నుంచి తలపెట్టిన లెక్చరర్ల ప్రదర్శన రద్దు చేసినట్లు పాతి జనరల్ సెక్రటరీ రవికుమార్ ప్రకటించారు.

**కమిటీ స్వరూపం ఇది..**

రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలులో



ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు.. ఉన్నత విద్యను మరింతగా మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి సంబంధించి విధి విధానాలు, ట్రస్టు బ్యాంకు ద్వారా నిర్వహణ, నిధుల సేకరణకు అవసరమైన సిఫార్సులను చేయనుంది. సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి వైస్ చైర్మన్‌గా వ్యవహరించనున్న ఈ కమిటీలో విద్యాశాఖ, ఎస్సీ అభివృద్ధి, బీసీ సంక్షేమం, గిరిజన సంక్షేమం, మైనారిటీ సంక్షేమ శాఖల కార్యదర్శులు, ఉన్నత విద్యామండలి చైర్మన్‌తో పాటు ప్రొఫెసర్ కంచ ఐలయ్య, ప్రొఫెసర్ కోదండరాం, ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల సంఘాల సమాఖ్య (పాతి) నుంచి ముగ్గురు ప్రతినిధులు సభ్యులుగా ఉండనున్నారు. వీరితోపాటు కమిటీ చైర్మన్ నిర్ణయించే మరో వ్యక్తి కూడా సభ్యుడిగా ఉంటారు. మొత్తం 15 మందితో కూడిన ఈ కమిటీకి ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు.

# ఒంటిచేత్తో నడిపిస్తున్న కేటీఆర్

**హైదరాబాద్ :** పదిహేనేళ్లకు పైగా ఎమ్మెల్యేగా.. పదేళ్లు మంత్రిగా, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అనుభవం ఉన్న కల్వకుంట్ల తారకరామారావు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాలపై ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నారు. పార్టీ కార్యకలాపాలు, ప్రభుత్వంలో ఉన్నప్పుడు పరిపాలన.. తండ్రి కేసీఆర్ బాటలో తను నడుస్తూ, ఆయనకు చేదోడువాదోడుగా ముందుకు సాగిన కేటీఆర్ ప్రస్తుతం అన్ని బాధ్యతలను తనే నిర్వర్తిస్తున్నారు.ఇప్పటికే పలు ఎన్నికల బాధ్యతను విజయవంతంగా పూర్తిచేసిన కేటీఆర్, రాజకీయ ప్రస్థానంలో జూబ్లీహిల్స్ మరో మైలురాయిగా నిలువబోతుంది. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించడం నల్లేరుపై నడకగానే ఉంది. ఈ ఉపఎన్నికల తీరు తెన్నులపై పలు సంస్థలు నిర్వహించిన సర్వే నివేదికలు కూడా ఇదే అంశాన్ని స్పష్టం చేస్తున్నాయి. వాస్తవానికి ఉప ఎన్నికల్లో అధికార పార్టీ గెలిచేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. జూబ్లీహిల్స్‌లో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నా యి. ఇక్కడ అధికార కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగులుతుందని పలు సర్వేలు చెబుతు న్నాయి. అయితే జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ సాధించబోయే విజయానికి సంబంధించిన ఘనత.. ప్రచారాన్ని ముందుండి ఒంటిచేత్తో నడిపించిన కేటీఆర్‌కే దక్కుతుంది. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రభావం రాష్ట్రమంతటా వ్యాపించే అవకాశం లేకపోలేదు. తెలంగాణలోని అన్నివర్గాల్లో కేటీఆర్ పట్ల విశ్వాసం పెరుగుతున్నది. ప్రస్తుతం రాష్ట్రంలోని ఉన్నతాధికారులు మొదలుకుని అటు వ్యాపారులు, ప్రభుత్వ నిర్ణయాల బాధితులు కేటీఆర్‌ను కలిసేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొందరు అధికారులు, వాణిజ్యవేత్తలు ఇప్పటికే ఆయనతో టచ్‌లో ఉన్నారు. కాంగ్రెస్‌పై అసంతృప్తి పెరుగుతున్నదని చెప్పడానికి ఈ పరిణామం నిదర్శ నంగా ఉందని పరిశీలకులు చెబుతున్నారు.2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినా బీఆర్ఎస్ పార్టీ, కేటీఆర్ ప్రజాక్షేత్రంలోనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం దిశగా పోరాటం చేస్తున్నారు. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో మరింత పటిష్టంగా రంగంలోకి దిగారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఆయన పార్టీ కార్యకర్తల్లో ఉత్సా హాన్ని నింపుతున్నారు. కాంగ్రెస్ ప్రభు త్వ పాలనపై కేటీఆర్ తీవ్ర విమర్శలు చేస్తున్నారు. అవినీతి, వాగ్దానాల అమలుపై విమర్శల బాణాలు ఎక్కుపెడుతూ బీఆర్ఎస్ వైపు ప్రజల దృష్టిని తిప్పే ప్రయత్నం చేస్తున్నారు.మరోవైపు పార్టీ అంతర్గతంగా కూడా కేటీఆర్ తన ఆధిపత్యాన్ని బలోపేతం చేసుకున్నారు. మీడియా ద్వారా బీఆర్ఎస్ అజెం డాను మళ్లీ తెరపైకి తీసుకురావడం వంటి చర్యలు ఆయన దూకుడుకు సంకేతాలుగా కనిపిస్తున్నాయి. ఈ దూకుడులో భాగంగా పార్టీ పునరుద్ధరణ, పాలక పక్షంపై తీవ్ర విమర్శలు, కొత్త తరం నాయకత్వాన్ని ప్రోత్సహించడం, అభివృద్ధి, ఐటీ, ఇన్నోవేషన్ అం శాలపై మళ్లీ చర్చకు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారు కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తిచేసుకుంటున్న నేపథ్యంలో బీఆర్ఎస్ తిరిగి పుంజుకుంటుంది. ప్రస్తుతం బీఆర్ఎస్ ముఖచిత్రంగా నిలుస్తున్న కేటీఆర్ దూకుడు తెలంగాణ రాజకీ యాల్లో కొత్త చర్చకు దారితీస్తోంది. హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. వైద్యరంగం, విద్యా వ్యవస్థ, మిషన్ భాగీరథ, రైతుబంధు వంటి పథకాల అమలులో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ పునర్నిర్మాణంపై కేటీఆర్ ప్రధానంగా దృష్టి సారిం చారు. గ్రామస్థాయిలో యూత్ కమిటీలు, మండల స్థాయిలో కోఆర్డినేటర్లు, జిల్లా స్థాయిలో వర్కింగ్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. అంతర్గతంగా బీఆర్ఎస్ పార్టీలో శక్తివంతమైన మార్పులకు కేటీఆర్ శ్రీకారం చుడుతున్నారు. జిల్లాలవారీగా సమన్వయకర్తల నియామకాలు, యువతకు పెద్ద పీట, సోషల్ మీడియా టీంల బలోపేతం వంటి వ్యూహాత్మక అడుగుతు వేస్తున్నారు.కేసీఆర్ తరచూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకపోయినా కేటీఆర్ నాయకత్వం పార్టీని నూతన దిశలో నడిపే ప్రయత్నం చేస్తున్నదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఐటీ, పట్టణాభివృద్ధి మంత్రిగా పనిచేసిన సమయంలో హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దిన నాయకుడిగా కేటీఆర్‌కు గుర్తింపు ఉంది. ఇప్పుడు ఆ ఇమేజ్‌ను రాజకీయ పునరుద్ధరణలో ఆయుధంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజల్లో మళ్లీ పెరుగుతున్న ఆదరణ, పార్టీ పునర్నిర్మాణం వంటి పరిణామాలు కేటీఆర్‌ను తెలంగాణ రాజకీయాల్లో కేంద్ర బిందువుగా మార్చే అవకాశం ఉంది. ప్రస్తు తం కొనసాగుతున్న కేటీఆర్ దూకుడు రాబో యే ఎన్నికల రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చనున్నది. పార్టీ పునర్మిర్మాణం తో ప్రభుత్వ విధానాలను కేటీఆర్ ఎప్పటికప్పుడు ఎండగడుతున్నారు.అవినీతి, నిర్వాహక లోపాలు, యువత నిరుద్యోగం వంటి అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వా న్ని నిలదీస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలోనే తెలంగాణ ప్రగతి సాధ్యమని ప్రజలకు పిలుపునిస్తున్నారు. అయితే ఈ పరిణామాలన్నీ భవిష్యత్ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను కీలక స్థానంలో నిలబెట్టే అవకాశం లేకపోలేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.తెలంగాణ రాజకీయాల్లో కేటీఆర్ హవా రోజురోజుకూ పెరుగుతున్నది. అయితే ఇటీవల కాలంలో రాష్ట్రంలోని ఉన్నతాధికారు లు, వ్యాపారవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు కేటీఆర్‌ను కలిసేందు కు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఇది తీవ్ర చర్చనీయాంశమవుతున్నది. అయితే ఈ విషయం బహిర్గ తం కాకపోయినా బీఆర్ఎస్ తిరిగి బలపడుతుంద న్న సంకేతంగా రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతున్నది.కేటీఆర్ ఐటీ, పట్టణాభివృద్ధి మంత్రిగా ఉన్న కాలంలో రూ పొందించిన పలు ప్రాజెక్టులు ప్రస్తుతం మళ్లీ చర్చలోకి వస్తున్నాయి. కొం తమంది సీనియర్ అధికారులు ఆయనను కలవడం ద్వారా హైదరా బాద్ మెట్రో విస్తరణ, టీఎస్ఐఐసీ ప్రాజెక్టులు, డిజిటల్ సిటీ విస్తరణ వంటి అంశాలపై చర్చించినట్లు సమాచారం. వీటిని కేవలం పరిపాలనా సమావేశాలుగా కాకుండా రాబో యే ఎన్నికల దిశగా వ్యూహాత్మక మంతనాలుగా విశ్లే షకులు అభిప్రా యపడు తున్నారు.ఐటీ కంపెనీలు, రియల్ ఎస్టేట్, ఇన్‌ఫ్రా రంగాలకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్తలు కూడా కేటీఆర్‌ను కలుస్తున్నారు. వీరిలో కొందరు ఆయనకు గత బీఆర్ఎస్ పాలనలో పెట్టుబడి వాతావరణం బాగుండేదని, ప్రస్తు తం విధానా లపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలుస్తోంది. ఇది కేటీఆర్ పట్ల వ్యాపార వర్గాల్లో మళ్లీ పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనంగా భావిస్తున్నారు. దీంతోపాటు రాష్ట్రంలోని ఆయా వర్గా లు ప్రభుత్వ నిర్ణయాలతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొం టున్నారు.ఈ విషయం లో కేటీఆర్ బాధితుల పక్షానా నిలబడి వారి సమస్యల పరిష్కారాని హామీ ఇస్తున్నారు. అందరికీ భవిష్యత్‌పై భరోసా కల్పిస్తున్నారు. అయితే ప్రస్తుతం కేటీఆర్ దూకుడు, ఈ భేటీలు, మీడియా చర్చలు చూస్తుంటే బీఆర్ఎస్ మళ్లీ పటిష్టంగా మారుతున్నదని స్పష్ట మవుతుంది. ఇది ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయ సమీకరణాలు కొత్త మలుపు తిరిగే అవకాశం ఉంది.జూబ్లీహిల్స్ ఉపఎన్నికలతో తెలంగాణ రాజకీయాలు ఊహించని పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఎన్నికల ఫలితాల తర్వాత కూడా బీఆర్ఎస్ పునర్మి ర్మాణంలో భాగంగా కేటీఆర్ ఇదే దూకుడు కొనసాగిస్తారా పలువురు అంచనా వేస్తున్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల అనంతరం కేటీఆర్ పొలిటికల్ ఇమేజ్ మరింత పెరగనున్నది. అయితే ప్రస్తుతం కేటీఆర్ తన ప్రసంగాల్లో 'ప్రజా పాలన వర్సెస్ పదేళ్ల ప్రగతి పాలన' పేరిట ప్రచారం చేశారు.ఈ నినాదాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే దిశగా వ్యూ హాలు రచించే అవకాశం ఉంది. కేటీఆర్ దూకుడు వ్యవహరిస్తుండటంతో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. ప్రస్తుతం కేటీఆర్ ప్రదర్శించే దూకుడు కేవలం వ్యక్తిగత రాజకీయం కాదని, బీఆర్ఎస్ భవిష్యత్ దిశను నిర్ణయించే ప్రాధాన్య మైన ఉద్యమంగా మారుతోందరి విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.'2028 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యం' అని స్పష్టమైన సందేశం ఇస్తూ బీఆర్ఎస్ పార్టీని కేటీఆర్ ముందుకు నడిపిస్తున్నారు. ఇందులో భాగంగా ఆయన పర్యటనలు, సమీక్షలు, వ్యూహాత్మక భేటీలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. కేటీఆర్‌ను కలవడానికి ఐటీ, ఇన్‌ఫ్రా, విద్య, హెల్త్ రంగాల ప్రముఖులు వస్తున్న క్రమంలో పెట్టుబడులు, అభివృద్ధి ప్రాజెక్టులు, భవిష్యత్ దిశపై చర్చలు జరుగుతున్నాయి.ఇది కేటీఆర్‌కు పరిపాలనా స్థాయిలోనూ మద్దతు పెరుగుతోందనే సూచనగా కనిపిస్తోంది. అయితే జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాల ప్రభావం భవిష్యత్ అసెంబ్లీ ఎన్నికలపై తప్పకుండా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇటు జూబ్లీహిల్స్‌లో, అటు భవిష్యత్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ క్యాడరను కేటీఆర్ సన్నద్ధం చేస్తున్నారు.

## రేవంత్ రెడ్డికి ఓటమి భయం పట్టింది.. అందుకే ప్రజలను భయపెడుతున్నాడు




**హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీకి ఓటెయ్యకపోతే పథకాలు ఆపేస్తామని అనడానికి రేవంత్ రెడ్డి అయ్య జాగీరా అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఇంట్లో నుంచి డబ్బులు ఇస్తున్నాడా లేదా ఆయన నాయన డబ్బులు ఇస్తున్నాడా అని మండిపడ్డారు. ప్రజల సొమ్ము ప్రజలకు ఇస్తున్నారని చెప్పారు. అది ప్రభుత్వం బాధ్యత అని, రేవంత్ రెడ్డికి ఓటమి భయం పట్టింది.. అందుకే ప్రజలను భయపెడుతున్నాడని చెప్పారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రెండేండ్ల కాంగ్రెస్ అరాచకపు పాలనకు జూబ్లీహిల్స్ ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే మరో మూడేండ్లు రాష్ట్ర ప్రజలు నరకయాతన అనుభవించాలన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో వికాసం, రేవంత్ రెడ్డి రెండేండ్ల పాలనలో అంతా విధ్వంసమని విమర్శించారు. కంటోన్మెంట్ ఉప ఎన్నిక ముందు ఇచ్చిన ఒక్క హామీ కూడా రేవంత్ రెడ్డి అమలు చేయలేదని మండిపడ్డారు. రోడ్లన్నీ గుంతలమయమయ్యాయని, వీధి దీపాలు లేవని, కాంగ్రెస్ గెలిచిన తర్వాత కంటోన్మెంట్ నియోజకవర్గం నాశనం అయిందని ధ్వజమెత్తారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికలో గెలిపిస్తే 6 వేల ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని చెప్పారని, రూ.23 కోట్ల స్పోర్ట్స్ కాంప్లెక్స్ కట్టిస్తామని, డిఫెన్స్ భూములను రెగ్యులరైజ్ చేస్తామని చెప్పారని.. ఆ హామీలన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఉన్నందుకే ముస్లింలు ఉన్నారని, తాము లేకుంటే ముస్లింలకు ఇజ్జత్ ఉండదని రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాడని విమర్శించారు. ముస్లింలు స్వాతంత్ర్యం కోసం యుద్ధం చేసినప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎక్కడుందని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ముస్లింలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ప్రశ్నించడం వల్లే నేడు కాంగ్రెస్ మంత్రులు గల్లీల్లో పరుగులు పెడుతున్నారని విమర్శించారు. పీజేఆర్‌కు మంత్రి పదవి ఇవ్వకుండా ఇబ్బంది పెట్టి, ఆయన మరణానికి కారణం అయిందే కాంగ్రెస్ పార్టీ అని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఎన్నికలు ఉన్నాయి కాబట్టి రేవంత్ రెడ్డికి ఎన్టీఆర్, పీజేఆర్ గుర్తుకువస్తున్నారని చెప్పారు. మైనార్టీలకు మంత్రి పదవి ఇవ్వాలని సోయి వచ్చిందన్నారు. ఇవన్నీ కేవలం ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ఒత్తిడి పెంచడం వల్లనే జరిగాయన్నారు.

## ఇక్కడ అవకాశాలు పుష్కలం.. పెట్టుబడులు పెట్టండి



ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచిన తెలంగాణలో అవకాశాలు పుష్కలమని, ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని అమెరికా - యూటా పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్ - యూటా ఎండీ, సీవోవో డేవిడ్ కార్లెబాగ్ నేతృత్వంలోని 'యూటా పారిశ్రామికవేత్తల బృందం' శుక్రవారం సచివాలయంలో ఆయనను ప్రత్యేకంగా కలిసింది. టెక్నాలజీ, ఇన్నోవేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్, లైఫ్ సైన్సెస్, ఏఐ ఆధారిత హెల్త్ కేర్, క్లీన్ ఎనర్జీ, ఎడ్యుకేషన్, స్కిల్స్ తదితర రంగాల్లో 'యూటా-తెలంగాణ' మధ్య ద్వైపాక్షిక సహకారం, నైపుణ్య మార్పిడికి గల అవకాశాలపై ఈ సమావేశంలో ప్రత్యేకంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... కేవలం పెట్టుబడులను ఆకర్షించడమే కాక, గ్లోబల్ ఎకానమీకి సపోర్ట్ ఇచ్చేలా, లాంగ్-టర్మ్ వాల్యూ క్రియేషన్ కు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో తీసుకొచ్చిన సంస్కరణలు, పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, ఏయే రంగాల్లో పెట్టుబడులకు తెలంగాణ అనుకూలం, పరిశ్రమల ఏర్పాటుకు గల అనుకూలతలు, పారిశ్రామికవేత్తలకిచ్చే ప్రోత్సాహకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం టీ-హబ్, టీ- వర్క్స్, వీ హబ్ లను వరల్డ్ ట్రేడ్ సెంటర్ - యూటా, సిలికాన్ స్లోప్స్ - యూటా టెక్ స్టార్టప్‌లతో అనుసంధానించేలా చొరవ చూపాలని ప్రతినిధి బృందాన్ని ఆయన కోరారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో యూనివర్సిటీ ఆఫ్ యూటా, బీవైయూ, న్యూమాంట్ యూనివర్సిటీలతో కలిసి రాష్ట్రంలోని ప్రముఖ విద్యా సంస్థలు ఉమ్మడి అకడమిక్, రీసెర్చ్ ప్రోగ్రామ్ లను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 'యూటా' రాష్ట్రంతో పటిష్ఠమైన, దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ ద్వైపాక్షిక సహకారం పెట్టుబడులకే పరిమితం కాకుండా ఇన్నోవేషన్, స్కిల్స్, టెక్నాలజీ రంగాల్లోఉమ్మడి ఆవిష్కరణలకు దిక్సూచీగా మారాలని మంత్రి శ్రీధర్ బాబు ఆకాంక్షించారు. తెలంగాణ లాంటి ఫాస్ట్-గ్రోయింగ్, డైనమిక్, ప్రో-యాక్టివ్ రాష్ట్రంతో కలిసి పని చేసేందుకు 'యూటా' సిద్ధంగా ఉందని డేవిడ్ కార్లెబాగ్ అన్నారు. రాబోయే రోజుల్లో ద్వైపాక్షిక సహకారం, నైపుణ్య మార్పిడి విషయంలో తెలంగాణతో కలిసి చురుగ్గా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో యూటా హౌజ్ ఆఫ్ రిప్రజంటేటివ్స్ జేసన్ థాంప్సన్, మాట్ మాక్‌ఫెర్సన్, నికోల్ మాక్‌ఫెర్సన్, లైఫ్ టైం ప్రెసిడెంట్ బీజే హాకే, జేకేడీ ప్రెసిడెంట్ మైక్ నెల్సన్, మోనెరె ఏఐ సీఈవో, కో-ఫౌండర్ మౌ నంది, భారత్ వ్యాలీ అడ్వైజర్లు స్టీవ్ వుడ్, సున్‌హోష్ లోడే, ఎక్విప్ సోషల్ ఇంపాక్ట్ టెక్నాలజీస్ ఫౌండర్ లక్ష్మీనారాయణ, ఐఐఆర్ఎఫ్ గురు సౌలే తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ షోలు, కార్నర్ మీటింగ్లకు భారీగా జన సమీకరణ

-మొదటిపేజీ తరువాయి



వీటికి హాజరయ్యే సాధారణ కార్యకర్తలకు రూ.400 నుంచి రూ.500 చొప్పున చెల్లిస్తున్నారు. కొంతమంది మహిళా సంఘాలను ఆశ్రయిస్తుండగా, మరికొందరు నేతలు యువజన సంఘాలను ఆశ్రయిస్తూ రోడ్లకు జనాన్ని తీసుకొస్తున్నారు.

**జిల్లాల నుంచి భారీగా..**

జిల్లాల నుంచి ప్రధాన పార్టీలకు చెందిన నేతలు ఉప ఎన్నిక ప్రచారంలో పెద్దసంఖ్యలో పాల్గొంటున్నారు. అలాగే గ్రేటర్ పరిధిలోని 24 నియోజకవర్గాల నుంచి ఆయా పార్టీల ముఖ్యనేతలు పాల్గొంటూ అభ్యర్థుల గెలుపుకోసం విస్తృత ప్రచారం చేస్తున్నారు. ప్రచారానికి మరో 4 రోజులు మాత్రమే గడువు ఉండటంతో స్థానికంగా బస్తీలు, కాలనీల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఉదయం 8గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ముఖ్యనేతలు ఓ పక్క ప్రచారం నిర్వహిస్తూనే మరోపక్క బూత్ల వారీగా పార్టీల కేడర్ తో ప్రత్యేక సమావేశాలు చేపడుతున్నారు. తమకు బాధ్యతలు అప్పగించిన బూత్లో భారీగా తమ పార్టీకి ఓటింగ్ పడేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఉచిత న్యాయ సహాయం కోసం న్యాయ సేవాధికర సంస్థను వినియోగించుకోవాలి.....




**సామాన్యుడి అస్త్రం :రాజన్న** ఉచిత న్యాయ సహాయం కోసం న్యాయ సేవాధికార సంస్థను వినియోగించుకోవాలని, సమస్యలను శాంతియుతంగా మరియు త్వరితంగా పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికర సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని లహరి గ్రాండ్ ఫంక్షన్ హాల్ లో న్యాయ సేవల దినోత్సవంను పురస్కరించుకొని న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ , 1987 అమల్లోకి వచ్చిన రోజు సందర్భంగా, పేద మరియు వెనుకబడిన వర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందించడంలో న్యాయ సేవా సంస్థల పాత్రను వివరించారు. ఉచిత న్యాయ సహాయం కోసం జిల్లా కోర్టు సముదాయంలో ఉన్న న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని లేదా హెల్ప్‌లైన్ నంబర్ 15100 ను సంప్రదించవచ్చని తెలిపారు. పట్టణంలోని ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రయోజనాల కోసం చెక్కిళ్ళ మహేష్ గౌడ్, న్యాయవాది మరియు హైదరాబాద్ కి చెందిన వక్తలు ఎం. వెంకట్ రెడ్డి, బి. నాగార్జున్, డాక్టర్ ఎంజివి సీతాపతి, కె. నాగరాజు, ఎస్. గమనం సమన్వయంతో ఒక రోజు సెమినార్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, క్లాస్ రూమ్ డైనమిక్స్, విద్యార్థులు మరియు ఉపాధ్యాయుల సాధికారత కోసం అధ్యయన నైపుణ్యాల సెషన్ గురించి వివరించారు. విద్యార్థులు కార్యక్రమాన్ని ప్రారంభించే ముందు ప్రార్థనగా వందేమాతరం పాటను పాడారు. అదనపు ఎస్పీ.డి.చంద్రయ్య, ఆర్డీఓ సిహెచ్. వెంకటేశ్వర్లు, సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు జె.శ్రీనివాసరావు, ఎంఈఓ. డి.రఘుపతి, జి.పి.కళ్యాణ్ చక్రవర్తి, పి.పి. పి.శ్రీనివాస్, ప్రైవేట్ స్కూల్స్ టౌన్ ప్రెసిడెంట్ వై.శ్రీనివాస్, లోక్ అదాలత్ సభ్యులు సిహెచ్.భాస్కర్, ఆడేపు వేణు, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై విద్యార్థులను తమ సలహాలతో ప్రోత్సహించారు.

# బండిఎల్కిచర్ల తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల..

గురుకులంలో నిర్లక్ష్య పర్వతం..
హాస్టల్‌లో లైట్లు లేవు, ఫ్యాన్స్ పనిచేయవు..
భోజనం నాసిరకం విద్యార్థుల గోడు..
ఉపాధ్యాయుల కొరత, వసతుల లోపం..
తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ పరిగి నియోజకవర్గం ఇంచార్జి ఆకాష్ నాయక్ డిమాండ్..




**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన గురుకుల విద్యాసంస్థలు.నేడు సమస్యల కోరల్లో చిక్కుకుని ఉన్నాయనే పరిస్థితి నెలకొంది. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని బండిఎల్కిచర్ల తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది.ఈ పాఠశాలను ఏఐఎస్ఎఫ్ (ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్) పరిగి నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఆకాష్ నాయక్ సందర్శించారు.విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.. పాఠశాలలో ఎన్నో ఏళ్లుగా అనేక సమస్యలు పరిష్కారం లేకుండా కొనసాగుతున్నాయని విద్యార్థులు ఆయనకు గోడు తెలియజేశారు.. విద్యార్థులు మాట్లాడుతూ హాస్టల్లో గదులలో లైట్స్ సరిగా లేవు, ఫ్యాన్స్ పనిచేయవు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించడం లేదు. చాలా సార్లు తక్కువ క్వాలిటీ భోజనం అందిస్తున్నారు.అదీ కాక పాఠశాల సిబ్బంది కొందరు మమ్మల్ని వ్యవసాయ పనులు చేయించేందుకు బలవంతం చేస్తున్నారని బాధ వ్యక్తం చేశారు.అంతేకాకుండా, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్, బయోసైన్స్ టీచర్,,మ్యాథ్స్ టీచర్ క్లాస్ అర్థం కావడం లేదు పోస్టులు కొరత ఉన్నాయని విద్యార్థులు తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఉత్తమ విద్య ఎలా కొనసాగుతుంది అని ప్రశ్నర్థకంగా మారింది. గతంలో ఉన్నత అధికారులు స్థానిక ఎమ్మెల్యే సందర్శించి తమ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినప్పటికీ నేటికి అమలుకు నోచుకోలేదని విద్యార్థులు అసహనం వ్యక్తం చేసారు..ఈ నేపథ్యంలో ఏఐఎస్ఎఫ్ నాయకుడు ఆకాష్ నాయక్ మాట్లాడుతూ...విద్యార్థులకు మంచి వాతావరణం, సరైన సదుపాయాలు, నాణ్యమైన భోజనం అందించడం ప్రభుత్వ బాధ్యత. కానీ ఇక్కడ పరిస్థితి పూర్తి గా భిన్నంగా ఉంది.చూడగానే నిర్లక్ష్యం కళ్ళకు కట్టినట్టుగా స్పష్టంగా కనిపిస్తోంది.. ఉపాధ్యాయుల కొరత, ఆహార నాణ్యత లేకపోవడం, విద్యార్థులతో వ్యవసాయ పనులు చేయించడం వంటి అంశాలు తీవ్రంగా ఖండించదగ్గవి అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారులు వెంటనే ఈ నెలకొన్న అంశాలను పరిగణలోకి తీసుకోని పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. హాస్టల్, పాఠశాల వసతులను మెరుగుపరచి విద్యార్థులు సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణంలో చదువుకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురుకులం విద్యా వ్యవస్థ అనాధ ఆశ్రమ లాగా దిగజారాయని అన్నారు. విద్య శాఖ మంత్రి లేకపోవడం వలన విద్య వ్యవస్థ బలయినపడింది అని ఆవేదన వ్యక్తం చేసారు.. తల్లిదండ్రులు విశ్వాసంతో పంపిన పిల్లలు ఇలాంటి పరిస్థితుల్లో ఉంటే, ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉంది అని బావిస్తున్నారు. విద్యార్థుల సమస్యలపై స్పందన లేకపోతే ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి ఆందోళనకు సిద్ధమవుతుందని ఆయన హెచ్చరించారు.విద్యార్థులు ఆశతో చేరిన గురుకులం.నిర్లక్ష్యంతో కూలిపోకూడదు. ఇది ఒక్క పాఠశాల సమస్య కాదు, మొత్తం వ్యవస్థలోని లోపాల ప్రతిబింబం అని ఆకాష్ నాయక్ అన్నారు...

# షాద్ నగర్ లో "వందేమాతరం"..

జాతీయ గౌరవాన్ని, ఐక్యతను పెంపొందిస్తున్న అద్భుతమైన గేయం
కుంటబడి పాఠశాలలో వందేమాతరం గీతం ఆలపించిన విద్యార్థులు
షాద్ నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో వందేమాతరం గీతం ఆలాపన



**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్** జాతీయ గేయం 'వందేమాతరానికి' 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చి ఇప్పటికీ జాతీయ గౌరవాన్ని, ఐక్యతను పెంపొందిస్తున్న ఈ అద్భుతమైన గేయం 150 సంవత్సరాల వేడుకలు 2025 నవంబర్ 7 నుంచి 2026 నవంబర్ 7 వరకు ఏడాది పొడవునా దేశవ్యాప్తంగా జరగనున్నాయనీ ఫరూక్ నగర్ మండలం మాజీ జెడ్పిటిసి పి వెంకట్రాంరెడ్డి, అదేవిధంగా షాద్ నగర్ హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కుంటబడి జిల్లా పరిషత్ హై స్కూల్ లో జరిగిన వందేమాతర ఆలాపన కార్యక్రమానికి వెంకట్రాంరెడ్డి హాజరయ్యారు అదే విధంగా షాద్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో వైద్య సిబ్బంది వందేమాతరం గీతాన్ని ఆలాపించారు. ఈ సందర్భంగా వందేమాతరం గీతానికి సంబంధించిన ప్రత్యేకతను అటు విద్యార్థులకు ఇటు వైద్య సిబ్బందికి వారు వివరించారు. నవంబర్ 7 కార్యక్రమంతో ఈ ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభమౌతాయనీ ఇప్పటికే భారత ప్రభుత్వం ప్రకటించింది. బంకించంద్ర ఛటర్జీ రచించిన జాతీయ గేయం 'వందేమాతరం' 2025 నాటికి 150 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుంది. 1875 నవంబర్ 7న అక్షయ నవమి పర్వదినం సందర్భంగా దీనిని రచించినట్లు చరిత్ర చెబుతుంది. ఆయన నవల 'ఆనందమఠ్'లో మొదటగా ఈ గేయం వెలుగు చూసింది. ఈ నవల అప్పట్లో 'బంగదర్శన్' అనే సాహిత్య పత్రికలో ధారావాహికగా వెలువడింది. ఆ తర్వాత 1882లో ఒక ప్రత్యేక పుస్తకంగా వచ్చింది. భారత్ భారీ సామాజిక, సాంస్కృతిక, రాజకీయ మార్పులకు లోనవుతున్న కాలమది. జాతీయ గుర్తింపు భావన, వలస పాలనపై ప్రతిఘటన పెరుగుతున్న ఆ కాలంలో వందేమాతరం.. మాతృభూమిని బలం, శ్రేయస్సు, దైవత్వానికి ప్రతీకగా మార్చింది. జాతీయ సమైక్యత, ఆత్మగౌరవాన్ని పెంపొందించింది. తర్వాత కొద్ది కాలంలో ఇది దేశభక్తికి శాశ్వత చిహ్నంగా మారింది. 1950 జనవరి 24న రాజ్యాంగ సభ అధ్యక్షుడు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్.. వందేమాతరం స్వాతంత్ర్య పోరాటంలో చారిత్రక పాత్ర పోషించిందని ప్రకటిస్తూ, జాతీయ గీతం జనగణమనతో సమానంగా సమాన గౌరవం ఇచ్చారు.

## బీసీ సంక్షేమ సంఘం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటలో భాగంగా ముందస్తు అరెస్టులు




**సామాన్యుడి అస్త్రం ఇల్లంతకుంట:** ఈరోజు ఇల్లంతకుంట మండలం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధమైన బీసీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.కరీంనగర్ జిల్లాకు గౌరవ గవర్నర్ శ్రీ జిష్ణుదేవ్ వర్మ పర్యటన నేపథ్యంలో ఈ అరెస్టులు జరిగాయి.
ఈ సందర్భంగా మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మోత్కూరు శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి జంపాల రితీష్, ఉపాధ్యక్షులు తోడేటి మధుకర్ గౌడ్, కారింగుల రాజేందర్, కోశాధికారి చింతల కౌశిక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మురహరి రాజు, మేకల తిరుపతి, నల్లగొండ రాజు, గుండారపు సాయి, తోట రాజు, గడ్డి గోవర్ధన్, గైకోడి రాజు, గంధం రవీందర్, శ్రావణ్, హరికృష్ణ, రమేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## అజిత్ సీడ్స్ వారి కొత్త సన్న రకం '-20' వరి వంగడం క్షేత్ర ప్రదర్శన




**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట:** ఇల్లందకుంట మండల కేంద్రంలో అజిత్ సీడ్స్ కంపెనీ ప్రతినిధులు '-20' అనే సన్న వరి రకం పై రైతులతో కలిసి క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు.శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన రైతులు ఎల్. రామారావు, జి. రాజేశ్వరరావు, ఈ. సంతాజీ ఈ వంగడాన్ని సాగు చేశారు. మంచి దిగుబడి రావడంతో కంపెనీ ప్రతినిధులు, రైతులు వీరిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి పలు గ్రామాల నుండి సుమారు 200 మంది రైతులు హాజరై,-20 వంగడాన్ని పరిశీలించారు. రైతులు ఈ పంట యొక్క పెరుగుదల, దాణా నాణ్యతపై సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా అజిత్ సీడ్స్ ఏరియా మేనేజర్ సురేష్ మాట్లాడుతూ,-20 వంగడం అన్ని రకాల నేలలకు అనుకూలంగా ఉండి, వాతావరణ మార్పులను తట్టుకోగలదని, అగ్గి తెగులు వంటి వ్యాధులను ఎదుర్కొని అధిక దిగుబడి ఇస్తుందని" తెలిపారు.అజిత్ కంపెనీ మొక్కజొన్న విత్తనాలు కూడా మార్కెట్లో అందుబాటులో ఉన్నాయని ఆయన రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్లు చ. భాస్కర్, డి. రమేష్, డీలర్లు కె. అశోక్ రెడ్డి, ఎం. గోపాల్ రావు, ఈ. నేతాజీ, ఎం. రామకృష్ణ, కంపెనీ మేనేజర్ పీ. రాజేష్ తదితరులు పాల్గొన్నారు

## సిఎంపిఎఫ్ పెన్షనర్ల కొరకు డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంప్ ల నిర్వహణ




**సామాన్యుడి అస్త్రం మణుగూరు:** కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంపెయిన్ 4.0 లో భాగముగా దేశవ్యాప్తంగా అన్ని సంస్థల పెన్షనర్స్ లో "డిజిటల్ సాధికారత" పెంచాలనే ఉద్దేశం తో పెన్షనర్స్ అందరూ తమ ఆండ్రాయిడ్ మొబైల్ నుండే మొబైల్ అప్లికేషన్ ద్వారా సిఎంపిఎఫ్/ సిపిఆర్ఎంఎస్ డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ సమర్పించేందుకు అవగాహన కల్పించేందుకు క్యాంపులను నిర్వహించవలసినదిగా ఆదేశించారు.దానికి అనుగుణంగా సింగరేణి సంస్థ కోల్ మైన్ ప్రావిడెంట్ సంస్థల ఆధ్వర్యంలో డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంప్ లను నిర్వహించబోతున్నాము. ఇందులో భాగముగా మణుగూరు ఏరియాలో తేదీ. 10.11.2025 నాడు ఉదయం 10.00 గం" లకు డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంప్ ను కమ్యూనిటీ హాల్, పివి కాలనీ నందు నిర్వహించడం జరుగుతుంది. కావున, సిఎంపిఎఫ్ పెన్షన్ పొందుతున్న సింగరేణి మాజీ ఉద్యోగులు మరియు సిపిఆర్ఎంఎస్ కార్డుదారులు ఈ అవకాశమును సద్వినియోగ పరచుకోవాలని జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

# రోడ్ల పై గుంతల మరమ్మత్తులు వెంటనే చేయాలి

**రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి**

**బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన**

**సామాన్యుడి అస్త్రం మణుగూరు:** అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కొండంత దూరంలో ఉందని, ప్రజలతో చెలగాటం ఆడుతున్నారని కరకగూడెం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రావుల సోమయ్య అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు కరకగూడెం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో డిజిటల్ క్యాంపెనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రావుల సోమయ్య మాట్లాడుతూ బయ్యారం, కరకగూడెం, తాడ్వాయి ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదాలకు దారి తీస్తుందని, రోడ్లు మరమ్మత్తులు చేయకుంటే ప్రాణనష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని ఆక్షేపించారు. జిల్లా మంత్రులు వెంటనే స్పందించి డిఎంఎఫ్ టి, సిఎస్ఆర్ నిధుల నుండి రోడ్ల పై ఏర్పడిన గుంతలను మరమ్మత్తులు చేయాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేశారు. రోడ్లు మరమ్మత్తులు చేయకుంటే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో



కొమరం రాంబాబు, అక్కిరెడ్డి వెంకటరెడ్డి, రేగా సత్యనారాయణ, బైరిశెట్టి చిరంజీవి, పోగు వెంకటేశ్వర్లు, బుడగం రాము, గుడ్ల రంజిత్, అత్తె సత్యనారాయణ, మాజీ సర్పంచులు ఊకె రామనాథం, పాయం నరసింహారావు, కొమరం విశ్వనాథం, కొమరం శ్రీను, భూక్య అర్జున్, గొగ్గల నారాయణ, నిట్టా ఏడుకొండలు, పోగు ఎల్లగౌడ్, పఠాన్ యాకుబ్ ఖాన్, ఈసం సమ్మయ్య, పులి శ్రీధర్, గుమ్మడివెల్లి ప్రసాద్, భాస్కర్, యలగొండ శ్రీను, తోలెం రామారావు, మలకం వెంకటేశ్వర్లు, గుర్రం లాలు, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు సిద్ధి సునీల్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**సామాన్యుడి అస్త్రం మణుగూరు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం కూనవరం గ్రామపంచాయితీ, విప్పల సింగారం గ్రామపంచాయితీ, సమితి సింగారం గ్రామ పంచాయితీలలో ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటే ప్రజల ప్రభుత్వమని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజల పక్షపాతి అని తెలియజేశారు. గత ప్రభుత్వం పాలనలో కాకుండా మన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లుని ఇస్తుందని తెలియజేశారు. అయితే మండలాలలో గ్రామాలలో ఎలాంటి మోసం లేకుండా ప్రత్యేక అధికారులతో సర్వే చేయిస్తూ అర్హులైన వారికి మాత్రమే ఇందిరమ్మ ఇల్లు ఇవ్వబడుతుందని తెలియజేశారు. మోసాలు కుట్రలు లేకుండా అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ళను అందించాలనీ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం. కావున అధికారులు జాగ్రత్తగా పరిశీలించి అర్హులైన వారి పట్టికను తయారు చెయ్యాలని తెలియజేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మంజూరైన కల్లూరి భవాని, చీమల అమ్మాజీ, పసులేటి సౌజన్య, కలబోయిన వెంకటయ్య, తోలెం ప్రమీల లబ్ధిదారులతో నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పాయం భూమి పూజ చేశారు. సకాలంలో ఇళ్లు పూర్తి చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న



?5 లక్షల ఆర్థిక సాయం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీవో వెంకటేశ్వరరావు, ప్రభుత్వ అధికారులు మండల ముఖ్య నాయకులు, మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, పినపాక నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తరుణ్ రెడ్డి, మహిళా మండల అధ్యక్షురాలు సౌజన్య, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, కరకగూడెం మండల అధ్యక్షుడు ఇక్బాల్ హుస్సేన్, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వందేమాతరం గేయ రచనకు 150 సంవత్సరాలు

**జీఎం కార్యలయంలో దేశభక్తి ఉత్సాహంతో ఘనంగా నిర్వహించిన కార్యక్రమం**

**సామాన్యుడి అస్త్రం మణుగూరు:** కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రజా రంగ సంస్థల్లో నవంబర్ 7న వందేమాతరం గేయాన్ని సమూహంగా ఆలపించాలని సూచించబడింది. ఈ రోజు ఉదయం 10:00 గంటలకు మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ ప్రాంగణంలో "వందేమాతరం" గేయ రచనకు 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఘనంగా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది సమూహంగా వందేమాతరం గేయాన్ని ఆలపించి దేశభక్తి భావనను వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏరియా ఎస్ఓ టు జీఎం బి.శ్రీనివాస చారి పాల్గొని, దేశ చరిత్రలో "వందేమాతరం' గేయం యొక్క ప్రాధాన్యతపై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ వందేమాతరం గీత రచయిత బంకిమ్ చంద్ర చట్టోపాధ్యాయ 1875-76 మధ్యకాలంలో ఈ గేయాన్ని రచించి, తరువాత 1882లో ఆనందమఠం నవలలో భాగంగా ప్రచురించారు. ఈ గేయం భారత స్వాతంత్ర్యోద్యమానికి ప్రతీకగా నిలిచింది. "వందేమాతరం గీతం భారత స్వాతంత్ర్య సమరయోధుల హృదయాల్లో అగ్నిని రగిలించిన చారిత్రక గీతం. ఈ గేయం ద్వారా మన తల్లి భూమికి వందనం చేయడం ప్రతి భారతీయుడి కర్తవ్యం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించడంతో పాటు దేశభక్తి భావనను ప్రజల్లో బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. జిఎం కార్యాలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. అధికారులు, సిబ్బంది, కాంట్రాక్ట్ కార్మికులు అందరూ సమిష్టిగా పాల్గొని వందేమాతరం గీతం ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జిఎం బి. శ్రీనివాస చారి, ఏఎస్ఐ వెంకట రామారావు, ఏజిఎం(ఐఈడి) సిహెచ్. రాంబాబు, డిజిఎం (పర్సనల్) ఎస్ రమేశ్, డిజిఎం (ఫైనాన్స్) ఎం. అనురాధా, డిజిఎం (సివిల్) శివ ప్రసాద్, హెచ్ ఓడి (క్వాలిటీ) నాగ రమేశ్, ఎస్ఈ (పర్చేస్) ఎస్. ప్రవీణ్







కుమార్, ఏరియా సెక్యూరిటీ అధికారి కే. శ్రీనివాస్, సర్వే అధికారి ఎల్. దయాకర్, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి, ఐటి మేనేజర్ సాయిల సురేశ్, సీనియర్ ఎస్టేట్స్ అధికారి బాబుల్ రాజ్, జిఎం ఆఫీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర పోరాటంలో ఉత్సాహం నింపిన గేయం వందేమాతరం

**. . . పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్**

**సామాన్యుడి అస్త్రం నిజామాబాద్ :** బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటంలో ఉత్సాహం నింపిన గేయంగా వందేమాతరం చరిత్రలో నిలిచిపోయిందని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి అన్నారు. వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిజామాబాద్ నగరంలోని ఆర్ బివిఆర్ఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం 150 చోట్ల ఈ కార్యక్రమాన్ని పండగలా చేయాలని నిర్ణయించిందని అన్నారు. 150వ సంవత్సరాన్ని ఇలా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సామూహికంగా వందేమాతర గీతాలాపన చేశారు. ఈనెల 26 వరకు వివిధ కార్యక్రమాలు కొనసాగుతాయని అన్నారు. అనంతరం నాయకులు, విద్యార్థులతో కలిసి స్వదేశీ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ శాసనసభ్యులు పైడి రాకేష్ రెడ్డి,





భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి గోపిడి ప్రవంతి రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి? ఆర్ బివిఆర్ఆర్?సొసైటీ చైర్మన్, అధ్యక్ష, కార్యదర్శులు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## షాద్ నగర్ డిపో బస్సు కు ప్రమాదం...

**ఆరాంఘర్ చౌరస్తా దగ్గర రోడ్డు ప్రమాదం..**

**షాద్ నగర్ నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును..**

**వెనుక నుంచి ఢీకొట్టిన డీసీఎం.. పలువురికి గాయాలు**





**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్** వరుస రోడ్డు ప్రమాదాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే చేవెళ్ల బస్సు-టిప్పర్ ప్రమాదం మిగిల్చిన విషాదం మరువక ముందే మరికొందరు డ్రైవర్లు.. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ భయాందోళనకు గురిచేస్తున్నారు. శుక్రవారం (నవంబర్ 07) ఉదయం హైదరాబాద్ లో ఆర్టీసీ బస్సును వెనుక నుంచి డీసీఎం ఢీకొట్టడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆరాంఘర్ చౌరస్తా దగ్గర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. షాద్ నగర్ నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులోని ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారిని వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బస్సు డ్రైవర్, కండక్టర్ల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న రాజేంద్రనగర్ పోలీసులు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..

## చేనేత కార్మికులకు రుణమాఫీ చేసి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం



**సామాన్యుడి అస్త్రం జనగామ:** చేనేత కార్మికులకు రుణమాఫీ చేసి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం చేనేత కార్మికులకు రుణమాఫీ చేస్తానని ప్రభుత్వం హామీ ఇచ్చి 12 నెలలు గడుస్తున్నా నేటికీ అమలు కాలేదు దుర్భర జీవితం గడుపుతున్నారు చేనేత కార్మికుల దయ చూపించి ప్రభుత్వం కుటుంబాలను ఆదుకోవాలి చేనేత కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు స్థలం లేని వాళ్లకు స్థలం ఇచ్చి ఇల్లు నిర్మాణం చేపట్టాలి మరో వర్క్ షెడ్ కు మూడు లక్షలు ఇవ్వాలి చేనేత కార్మికుల వ్యక్తిగత రుణాలు మాకు చేసి వెంటనే ఖాతాలోకి జమ చేయాలి తిరిగి నేత కార్మికులకు వ్యక్తిగత రుణాలు ఇవ్వాలి వడ్డీ లేకుండా వ్యక్తిగత రుణాలు మంజూరు చేయాలని నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బిర్రు ఇస్తారి ప్రభుత్వాన్ని చేతులు జోడించి ప్రార్థిస్తున్నాము


## దాలిగుమ్మడి గ్రామంలో రహదారి కోసం డిమాండ్

**జన్ మన పథకం కింద సీసీ రోడ్డు నిర్మాణం కోరిన గ్రామస్తులు, హుకుంపేట సర్పంచ్ సమీడా, వెంకట పూర్ణిమ**



**సామాన్యుడి అస్త్రం న్యూస్ అల్లూరి :** హుకుంపేట మండలం హుకుంపేట పంచాయతీ పరిధిలోని దాలిగుమ్మడి గ్రామంలో నివసిస్తున్న ( పి వి టి జి,) వర్గాల ప్రజలు ప్రాథమిక సదుపాయాల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామానికి సీసీ రోడ్డు మరియు డ్రైనేజ్ సౌకర్యాలు అత్యవసరమని గ్రామస్తులు డిమాండ్ చేశారు. పీఎం జన్ మన పథకం ద్వారా ఇళ్లు మంజూరైనప్పటికీ రహదారి లేకపోవడం వల్ల నిర్మాణ సామగ్రి గ్రామానికి తరలించడంలో తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు వెల్లడించారు. ఈ సందర్భంగా హుకుంపేట సర్పంచ్ సమిడ పూర్ణిమ స్పందన కార్యక్రమంలో పాల్గొని, "కేవలం పివిటిజి గ్రామాల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన జన్ మన పథకం కింద మా గ్రామానికి సీసీ రోడ్డు, డ్రైనేజ్ సౌకర్యాలు మంజూరు చేయాలి" అని అధికారులను కోరారు. కార్యక్రమంలో హుకుంపేట వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు పాంగి అనిల్, గ్రామస్థులు పాంగి రాజుబాబు, పాంగి దేముళ్ళు, నందకాదోర సింహచలం తదితరులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఆకాంక్షించారు.

## ఏడిద గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం



**సామాన్యుడి అస్త్రం కోనసీమ :** మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తోట త్రిమూర్తులు ఆదేశాల మేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ మండపేట మండలం లోని ఏడిద గ్రామంలో చేపట్టారు. ప్రైవేటీకరణ పేరుతో తమ తాబేదారులకు మెడికల్ కాలేజీలను కట్టబెట్టాలని కూటమి ప్రభుత్వం చేస్తున్న విషయాన్ని స్థానిక ప్రజలకు వివరిస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేద ప్రజలను దిగజార్చే ఆలోచనలు తప్ప, వారికి మంచి చేయాలన్న ఆలోచన ఉండదని ప్రజలకు వివరిస్తూ ఈ సంతకాల సేకరణ జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ. పసుమర్తి నాగబాబు ఎంపీటీసీ సభ్యులు పట్నాల నాగబాబు , తాతపూడి ఉషా రాజేష్.. వైఎస్ఆర్సిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల సుధాకర్ రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రెటరీ వాసిరెడ్డి అర్జున్ వైస్ ప్రెసిడెంట్ చంద్ర శీను. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వల్లూరి రామకృష్ణ బూరుగ జానీ విసుపురెడ్డి శివ , గంధం ప్రసాద్, చీకట్ల వినయ్, ఏవీ రెడ్డి, హరిదాసుల సూరిబాబు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు..

**చిర్ల జగ్గిరెడ్డి ఆదేశాలతో ఆలమూరు మండలం అన్ని గ్రామాల్లో దుమ్ము రేపుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలు**

**సామాన్యుడి అస్త్రం ఆలమూరు :** సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఆదేశాలతో ఆలమూరు మండలంలో ఆలమూరు మండల ప్రెసిడెంట్ తమ్మన శ్రీనివాస్ అధ్యక్షతన ఆలమూరు మండల పరిసర గ్రామాలలో కోటి సంతకాల సేకరణకు ప్రజల నుంచి ఇప్పటికే భారీ స్థాయిలో మద్దతు లభిస్తుంది. ఈ కార్యక్రమాల్లో ఆలమూరు మండల లో ప్రతి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, నాయకురాలు కార్యకర్తలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తమ యొక్క ఆస్తులను ప్రైవేటు పరం కాకుండా అడ్డుకోవడానికి తమ వంతుగా తమ సంతకాలు చేస్తూ కూటమి ప్రభుత్వానికి తమ యొక్క వ్యతిరేకతను ప్రజలు తెలియజేస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఈ యొక్క కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలకు ప్రతి మండలంలో అహర్నిశలు కృషి తో పూర్తిగా శ్రమిస్తూ తమ యొక్క కార్యకర్తలను నాయకులను పార్టీ శ్రేణుల తో ఎప్పటికప్పుడు పార్టీ ఇచ్చిన ఆదేశాలతో తమ యొక్క జిల్లాలో 2029 గెలుపే లక్ష్యంగా మళ్లీ వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా విజయ బావుట ఎగరవేసేందుకు కృషి చేస్తున్నారని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజల యొక్క అభిప్రాయమని ప్రజల తెలియజేస్తున్నారు.



## పి గన్నవరం నియోజకవర్గంలో కోటి సంతకాల సేకరణ మరియు రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి



**సామాన్యుడి అస్త్రం కోనసీమ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి గన్నవరం నియోజకవర్గం గన్నవరం మండలం ఊడిమూడి గ్రామంలో ఈరోజు పి గన్నవరం నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు గారి ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ మరియు రచ్చబండ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి మరియు అమలాపురం పార్లమెంట్ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి . ఈ కార్యక్రమంలో పి గన్నవరం పరిశీలకులు ,రాష్ట్ర కార్యదర్శి చింతలపాటి శ్రీనివాస రాజు, మాజీ శాసనసభ్యులు పాముల రాజేశ్వరి దేవి,ఎస్ ఇ సి,మెంబర్ కాశీ బాలముని కుమారి, , ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వందేమాతరం ప్రతి ఒక్క భారతీయుడి గుండెల్లో దేశభక్తిని రగిలించింది





**. . . పోలీస్ కమిషనర్ సాయి చైతన్య**

**సామాన్యుడి అస్త్రం నిజామాబాద్** వందేమాతరం అనే పదం ప్రతి ఒక్క భారతీయుడి గుండెల్లో దేశభక్తిని రగిలించిందని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో నిజామాబాద్ పోలీస్ కమీషనర్ సాయి చైతన్య ఆధ్వర్యంలో 150 సంవత్సరాల వందేమాతరం గీతం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ బంకించంద్ర చట్టోపాధ్యాయ రచించిన ఈ గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఈ సందర్భం మనందరికీ గర్వకారణం అన్నారు. ఈ గీతం మన స్వాతంత్ర్యసమరయోధులకు ప్రేరణ గా నిలిచినట్లే నేటి తరం యువతకు దేశప్రేమ కర్తవ్యనిష్ట ఐక్యత అనే విలువలను స్ఫూర్తిగా అందిస్తుందని తెలిపారు. ఈ మహోత్సవ సందర్భంగా మన దేశపు తల్లి భూమికి మనమందరం వందనం చేయాలి. "వందేమాతరం " అని ఆలపించడం కేవలం ఒక గీతం పాడడం కాదు, అది మన తల్లి దేశానికి ఇచ్చే గౌరవ ప్రధమైన ప్రమాణం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డి.సి.పి (ఎ.ఆర్) రామ చందర్ రావ్, ఆఫీస్ సూపరింటెండెంటులు శంకర్, బషీర్, రిజర్వు ఇన్స్పెక్టర్స్ శ్రీనివాస్, తిరుపతి, సి.సి.ఆర్.బి సిబ్బంది, పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, సెంట్రల్ కాంప్లెంటు సెల్ సిబ్బంది, డి.పి.ఓ సిబ్బంది, హెడ్క్వార్టర్స్ సిబ్బంది,హోమ్ గార్డ్సు సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రంకన్ డ్రైవ్ లో పట్టుబడిన ఇద్దరికి వారం రోజులు జైలు శిక్ష. . . 13 మందికి జరిమానా




**సామాన్యుడి అస్త్రం నిజామాబాద్ :** మద్యం తాగి వాహనాలు నడిపిన 15 మందికి ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ఆదేశానుసారం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నూర్ జహాన్ ఎదుట హాజరుపరచగా 13 మందికి 28,500 రూపాయలు జరిమానా, మరో ఇద్దరు తుమ్మ శ్రీవాత్సవ్, మచ్చేంధర్ లకు వారం రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. మోటర్ వెహికల్ యాక్ట్ 1988 ప్రకారం సెక్షన్ 185 క్రింద డ్రంకెన్ డ్రైవ్ లో పట్టుబడిన వారు శిక్షర్హులు అని, మోటర్ వెహికల్ అమెండ్మెంట్ యాక్ట్ 2019 ప్రకారం డ్రంకెన్ డ్రైవ్ లో పట్టు బడిన వారిని సోమవారం నుండి కోర్ట్ లో మొదటిసారి పట్టుబడిన వారికి రూ. 10 వేల జరిమానా లేదా 6 నెలల వరకు జైలు శిక్ష లేదా జరిమానాతో పాటు రెండు శిక్షలు విందించ బడుతాయన్నారు. డ్రంకెన్ డ్రైవ్ లో మొదటి సారి పట్టుబడిన తరువాత రెండవసారి, మూడు సంవత్సరాలలో మరోసారి పట్టుబడిన వారికి రూ.15,000 జరిమానా లేదా 6?నెలల జైలు లేదా జరిమానాతో పాటు జైలు శిక్ష విధించబడునన్నారు. కావున వాహనదారులు రోడ్డు నియమాలు పాటించాలని వాహనాలను తాగి నడప రాదని, లేని యెడల చట్ట ప్రకారం పై విధంగా చర్యలు తీసుకోబడునని ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

# గుండ్ల సింగారం ఎక్కడుంది

**ఇసుక కోసం మళ్లీ గ్రామం గుర్తొచ్చిందా?**

**ఆదివాసీ సమాజాన్ని, ఏజన్సీ చట్టాలను మోసం చేస్తున్నారు**

**గుండ్ల సింగారం ర్యాంపుపై విచారణ జరిపించాలి**

**రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు**

**పూనెం సరోజిని**



**సామాన్యుడి అస్త్ర మణుగూరు :** ఇసుక ర్యాపుల కోసం ప్రస్తుతం లేని గ్రామాలను తెరపైకి తీసుకువచ్చి ఆదివాసీ సమాజాన్ని, ఏజెన్సీ చట్టాలను మోసం చేస్తున్నారని రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ డిమాండ్ చేశారు. మణుగూరు మండలం గుండ్ల సింగారం అనే గ్రామం 20 సంవత్సరాల క్రితమే సింగరేణి ఓసిలో క్రింద తీసుకుని భూ నిర్వాసితులకు ప్యాకేజీ కూడా ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ రోజు గుండ్ల సింగారం పేరుతో ఊరు లేని చోట ఊరు పేరు చెప్పుకకుంటూ కొన్ని లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను భారీ యంత్రాలతో డంపింగ్ చేసారన్నారు. దానికి టీజీఎండిసి ఏ రకంగా పర్మిషన్ ఇచ్చిందని ప్రశ్నించారు. అమైండ్మెంట్ యాక్ట్, పీసా చట్టం ప్రకారంగా ఆ గ్రామాన్ని సందర్శించారా అన్నారు. పీసా గ్రామసభ పెట్టరా అని రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు అన్నారు. ఇట్టి ఇసుక ర్యాంపు పై అధికారులు ఏ రకంగా సంతకం పెట్టారని. మైనింగ్ డిపార్ట్మెంట్ అధికారులు ఎలా సంతకాలు చేసి పర్మిషన్ లు ఇచ్చారన్నారు. ఈ ఊరును మాకు చూపెట్టాలని డిమాండ్ చేసారు. లేనిచో సర్వే భవన్ నుండి మ్యాప్ లు తెప్పించి అధికారులపై హై కోర్టు లో కేసులు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు, సీనియర్ మహిళా కాంగ్రెస్ నాయకురాలు ఎండి షబానా, కోరి శ్యామల, దేరంగుల సుజాత, కన్నాపురం వసంత, కన్నాపురం శైలజ, రెడ్డి బోయిన రేణుక మరియు సౌజన్య డాకూరి పాల్గొన్నారు.

## ఓల్డ్ హాఫీజ్ పెట్ లో బోయిని మహేష్ యాదవ్ జన్మదిన వేడుకలు




**అస్త్రం, హాఫీజ్ పేట్ :** ఓల్డ్ హాఫీజ్ పేట్ వద్ద బీజేపీ హాఫీజ్ పేట్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ బోయిని అనూష మహేష్ యాదవ్ జన్మదినం పురస్కరించుకొని శుక్రవారం ఓల్డ్ హాఫీజ్ పేట్, హుడా కాలనీ, గంగారాం, చందానగర్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో బీజేపీ సీనియర్ నాయకులు బోయిని మహేష్ యాదవ్ జన్మదిన కేక్ ను కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అనూష మహేష్ యాదవ్ కు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆహార పొట్లాలను అందజేశారు .ఈ కార్యక్రమానికి మాజీ కౌన్సిలర్ రమణయ్య ,బీజేపీ జిల్లా నాయకులు రవి గౌడ్ లు హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. అంతేకాకుండా సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రధాని నరేంద్ర మోదీ చూపిన బాటలో నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జగన్ గౌడ,రాజు ముదిరాజ్,బాబు రెడ్డి,శ్రీనివాస్ యాదవ్ పవన్, నర్సింహా యాదవ్,పాలం శ్రీనివాస్,నవీన్,దేవేందర్ దాస్,రాజేష్,రామారావు, సుబ్బారావు,వినయ్,రాజు,శ్రీను, రాములు, కుమార స్వామి, అనిల్,శివ,చెందు, నాయకులు,కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ లో పరేడ్ గ్రౌండ్ లో "వందేమాతరం" గీతాలాపన

**అస్త్రం, హైదరాబాద్:** "వందేమాతరం" జాతీయ గేయం150 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్ లో ఈరోజు వందేమాతరం గేయాన్ని సామూహిక గానం నిర్వహించారు.సైబరాబాద్ సిఏఆర్ హెడ్క్వార్టర్స్ ఏడీసీపీ జె.ఎస్.కె. షమీర్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్, సిఏఆర్ హెడ్క్వార్టర్స్ పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.పోలీస్ సిబ్బంది "వందేమాతరం" గీతాన్ని ఆలపించి, జాతీయ గీతానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తుచేశారు. స్వాతంత్ర్య సమరంలో ఈ గీతం ప్రేరణగా నిలిచిన విధానాన్ని, దేశ ఐక్యతను బలోపేతం చేసే స్ఫూర్తిని సీనియర్ అధికారులు సిబ్బందికి వివరించారు.ఈ కార్యక్రమంలో సిఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏసీపీ అరుణ్, లా అండ్ ఆర్డర్ సిబ్బంది, ఆర్ఐలు శేఖర్, వెంకటరమణ, అనిల్ కుమార్, ఆర్ఎస్ఐ పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఎస్‌హెచ్ జీ సభ్యులకు ఇందిరా మహిళాశక్తి చీరలు

**సిద్ధమవుతున్న 64 లక్షల చీరలు**

**ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**రాజన్న సిరిసిల్ల :** ఇందిరా మహిళా శక్తి చీరల ఉత్పత్తిని పరిశీలించిన 32 జిల్లా సమాఖ్యల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులుఐడీఓసీలో సమావేశం.రాష్ట్రంలోని అన్ని మహిళా సంఘాల సభ్యులకు పంపిణీ చేసేందుకు ఇందిరా మహిళా శక్తి చీరలు యూని ఫామ్స్, సిద్ధవుతున్నాయని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాల పంపిణీ చేసే ఇందిరా మహిళా శక్తి చీరల యూనిఫామ్స్,ఉత్పత్తి ప్రక్రియ, ఇతర అంశాలను నేరుగా తెలుసుకునేందుకు రాష్ట్రంలోని 32 జిల్లాల నుంచి జిల్లా సమాఖ్య అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు జిల్లాకు రాగా, వారితో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శు క్రవారం ఇంచార్జి కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ. ఇందిరా మహిళా శక్తి కింద మహిళలకు చీరలు అందజేయడంతో ఇటు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని వేలాది మందికి ఉపాధి దొరుకుతుందని వెల్లడించారు. వస్త్ర పరిశ్రమకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. కార్మికులు ఎంతో నైపుణ్యంతో చీరలు నేస్తారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇందిరా మహిళ శక్తి కింద జిల్లాలోని మహిళా సంఘాలకు ఇప్పటికే క్యాంటీన్లు, డైరీ యూనిట్, కోడి పిల్లల పెంపకం, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంక్, ఇతర స్వయం ఉపాధి యూనిట్లను అందజేశామని తెలిపారు.మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందితే తమ కుటుంబంతోపాటు సమాజ అభివృద్ధి సాధ్యమనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి పథకంలో మహిళలను భాగస్వామ్యులను చేస్తుందని వెల్లడించారు. ప్రతి ఎస్ హెచ్ జీ మహిళా రుణాలను తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి మహిళా ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించి, మిగతా వారికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. వస్త్ర ఉత్పత్తి పరిశీలన:సిరిసిల్ల జిల్లా కేంద్రంలో వెంకట్రావునగర్ లోని మరమగ్గాల యూనిట్, గీతానగర్ లోని ప్రాసెసింగ్ యూనిట్, వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాంను పరిశీలించారు. ఇందిరా మహిళా శక్తి మరమగ్గాల పై సిద్ధం అవుతున్న చీరలను ఇంచార్జి కలెక్టర్, ఆయా జిల్లాల మహిళా సంఘాల బాధ్యులు నేరుగా పరిశీలించారు. దారం నుంచి చీరల తయారయ్యే విధానాన్ని చూసి, దాని వివరాలను కార్మికులు, యజమానులను మహిళలు అడిగి తెలుసుకున్నారు. తాము వివిధ రకాల చీరలు కొనుగోలు చేసి వినియోగిస్తామని, మొదటి సారి వాటి తయారీ ప్రక్రియ, ఇతర దశలు, ప్యాకింగ్, గోడౌన్ ను నేరుగా చూసే అవకాశం వచ్చిందని తెలిపారు. కార్మికుల నైపుణ్యం, తయారీ విధానంపై అవగాహన వచ్చిందని పేర్కొన్నారు. ఎంతో నాణ్యతతో ఇందిరా మహిళా శక్తి చీరలు సిద్ధమవు తున్నాయని వివరించారు. సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, చేనేత జౌళి శాఖ జేడీ వెంకటేశ్వర్ రావు, డీఆర్డీఓ శేషాద్రి, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, చేనేత జౌళి శాఖ ఏడీ రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

# యువతే దేశ భవిష్యత్తు





**చట్టాన్ని గౌరవించే పౌరులుగా ఎదగాలి**

**ర్యాగింగ్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి**

**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**జగిత్యాల :** యువతే దేశ భవిష్యత్తు కాబట్టి, వారు చట్టాన్ని గౌరవిస్తూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పిలుపునిచ్చారు.శుక్రవారంకొండగట్టు జేఎన్ టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎస్పీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ .. "విద్య అనేది కేవలం ఉద్యోగం పొందడానికి మాత్రమే కాదు, మంచి వ్యక్తిత్వాన్ని నిర్మించడానికి ఉపయోగపడే ఆధ్యాత్మిక శక్తి అని ప్రతి విద్యార్థి జీవితంలో క్రమశిక్షణ, కష్టపడి చదువుకోవడం, ముఖ్యమని" అన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు మానవీయ విలువలను అలవరచుకోవాలి," అని అన్నారు. యువతే దేశ భవిష్యత్తు కాబట్టి, వారు చట్టాన్ని గౌరవిస్తూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.సోషల్ మీడియాలో సమయాన్ని వృథా చేయకుండా, దానిని నేర్చుకోవడానికీ, కొత్త ఆలోచనలను అభివృద్ధి చేసుకోవడానికీ వినియోగించు కోవాలని సూచించారు.సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, తెలియని లింకులు, ఫేక్ ఐడీలకు స్పందించకూడదని సూచించారు. కళాశాల యాజమాన్యం ఎప్పటికప్పుడు విద్యార్థుల నడవడిక, ప్రవర్తన పట్ల శ్రద్ధ వహించాలని ఎస్పీ సూచించారు. సీనియర్లు జూనియర్లు అనే తేడా లేకుండా స్నేహపూర్వక వాతావరణం లో విద్యాభ్యాసం కొనసాగించాలని, ర్యాగింగ్ వంటి చర్యలకు దూరంగా ఉండాలని, సమాజంలో ఆదర్శవంతులుగా నిలవాలని అన్నారు. అలాగే గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వాడకం భవిష్యత్తును నాశనం చేస్తుందని ఈలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి లాంటి మత్తుపదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీస్ వారికి అందివ్వాలని తెలిపారు. విద్యార్థులు చేడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకుని, కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు.

# కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలి

**జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత**



**జగిత్యాల :** వరి ధాన్యంకొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత సూచించారు. జిల్లాలోని మల్యాల మండలం రామన్నపేట తోపాటు పోతారం, రాజారం గ్రామాల్లో ప్యాడి సెంటర్లలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం అదనపు కలెక్టర్ బి.ఎస్ లత పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమే కొనుగోలు కేంద్రంలో తూకపు యంత్రాలు తేమయంత్రాలు ప్యాడి క్లీనర్స్ టార్పలెన్లు సరిపోయినన్ని అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు ఆదేశించారు.రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలను సమకూర్చాలని సూచించారు. వరి ధాన్యం కేంద్రంలో నిర్వాహకులు వివరాలు మద్దతు ధర టోల్ ఫ్రీ నెంబర్ వివరాలు స్పష్టంగా కనిపించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు.రైతులు వారి ధాన్యము కొనుగోలు కేంద్రాలకు తీసుకురాగానే రసీదులు జారీ చేయడంతో పాటు వారి బ్యాంకు వివరాలను సక్రమంగా నమోదు చేసి పంట రుసుము సకాలంలో రైతులు ఖాతాలో జమ అయ్యేలా చూడాలని సూచించారు అన్ని రకాల రిజిస్టర్లు పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు.రైతులతో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పంటకు మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి 2389 బి గ్రేడ్ రకానికి 2369 కల్పిస్తుందని రైతులు వరి ధాన్యము ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే ఇవ్వాలని తెలిపారు.ధాన్యాన్ని శుభ్రపరిచి తగిన తేమ శాతం కలిగిన తర్వాత మాత్రమే తూకానికి ఇవ్వాలన్నారు.వరి కొనుగోలు ప్రక్రియలు రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా టోల్ ఫ్రీ నంబర్ 18004258187 ను సంప్రదించాలని తెలిపారు. ఈ పరిశీలనలో డిఎస్ఓ జితేందర్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 10, 11 తేదీల్లో సర్టిఫికెట్స్ వెరిఫికేషన్

**హైదరాబాద్ :** తెలంగాణ జూనియర్ పంచాయతీ కార్యదర్శి పోస్టులకు సంబంధించిన కీలక అప్‌డేట్‌ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. స్పోర్ట్స్ కోటా కింద భర్తీ చేయనున్న పోస్టుకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ నవంబర్ 10, 11 తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో ఆయా తేదీల్లో నిర్వహించనుంది. ఈ మేరకు సంబంధిత వివరాలతో ప్రకటన జారీ చేసింది. పంచాయతీ కార్యదర్శుల ఎంపికలో భాగంగా ఈ రెండు రోజుల పాటు సర్టిఫికేట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు పంచాయతీరాజ్ శాఖ వెల్లడించింది.సర్టిఫికేట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు తమతోపాటు రాత పరీక్ష హాల్ టికెట్, పదో తరగతి, ఇంటర్, డిగ్రీల సర్టిఫికెట్లు, ఒకటో తరగతి నుంచి 7వ తరగతి చదివినట్లు ధ్రువీకరించే లోకల్ సర్టిఫికెట్, ప్రభుత్వ ఉద్యోగులైతే నో అబ్జక్షన్ సర్టిఫికెట్.. సర్వీస్ సర్టిఫికెట్లు, స్పోర్ట్స్ సర్టిఫికెట్, ఆధార్ కార్డులు తీసుకెళ్లాలి. ఒరిజినల్ పత్రాలతోపాటు జిరాక్స్ సెట్లు కూడా తమతోపాటు తీసుకెళ్లవల్సి ఉంటుంది. ఈ మేరకు అభ్యర్థులకు సూచనలు జారీచేస్తూ ప్రకటనలో పేర్కొంది.కాగా 2019లో కోర్టు వివాదాల నేపథ్యంలో స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన అభ్యర్థులను తొలగించిన విషయం తెలిసిందే. ఇప్పుడు వారితో పాటు కొత్తగా ఎంపికైన 172 మందికి కూడా సర్టిఫికేట్లను పరిశీలించనున్నారు. ఈ మేరకు అభ్యర్థులు గమనించవల్సి ఉంది.

## వర్షాలు సమృద్ధిగా కురిసాయని గంగమ్మకు బోనం



**సామాన్యుడి అస్త్రం కోనరావుపేట** మన తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలలో ప్రకృతిని పూజించడం పూర్వం నుంచి ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా కోనరావుపేట మండలం రామన్నపల్లి (బావుసాయిపేట) గ్రామంలో శుక్రవారం వర్షాలు సమృద్ధిగా కురిసి వాగులు వంకలు పొంగిపొర్లి, చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయని వ్యవసాయానికి ముఖ్య ఆధారమైన నీరు పుష్కలంగా సమకూరినందున రామన్న పల్లె పక్కనే గల మూల వాగు దగ్గర గంగమ్మకు బోనం తీసి యాట పిల్లలతో మొక్కు చెల్లించుకోవడం జరిగింది.ఇట్టి ఉత్సవంలో నక్క పెద్ద ఎల్లయ్య, బర్కం నారాయణ, చివర్ల దేవయ్య, నక్క మల్లేశం, దెబ్బ కొమురయ్య, బర్కం రమేష్, బర్కం పర్షయ్య, గుంటి ప్రశాంత్ ,కర్నాల కృష్ణ, పంబాల దేవయ్య, కర్నాల బాబు, ఆకుల రాజయ్య, ఆకుల లచ్చయ్య, ఎక్కల దేవి పోశయ్య తదితరులు పాల్గొన్నారు.

## వార్డులోని విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

**వనపర్తి :** వనపర్తి జిల్లా కేంద్రంలోని 33 వ వార్డులో విద్యుత్ సమస్యలపై మాజీ కౌన్సిలర్ ఉంగ్లం తిరుమల్ ఫోన్ ద్వారా అధికారులకు విన్నవించగా వార్డులో పర్యటిం చడం జరిగింది. వార్డులో లో వోల్టేజీ సమస్య మురుగు కాలువలో ఇనుప స్తంభాలు తొలగించి సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయడం నివాస గృహాలకు దగ్గరలో ఉన్న విద్యుత్ వైర్లను ప్రమాదం లేకుండా ఏర్పాటు చేయాలని శ్రీ వెంకటేశ్వర దేవాలయం ముందు రోడ్డు ఇరువైపులా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి రోడ్డుపైన వైర్లు లేకుండా చూడాలని మరియు భూమిపైనున్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వెంటనే ప్రమాదాలకు గురి కాకుండా సేఫ్ జోన్ లో ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు వార్డు మొత్తం తిరిగి సూచించడం జరిగింది వార్డులోకి వచ్చిన విద్యుత్ అధికారులు ాఇ. ఆఇ.ంఇ అధికారులు వెంటనే వార్డులోని విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని అసిస్టెంట్ ఏఈ లైన్మెన్ లకు ఆదేశాలు జారీ చేసి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది

## వికాసం- విధ్వంసానికి మధ్య

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక..

**మీట్ ద ప్రెస్ కార్యక్రమంలో హరీశ్ రావు**

**హైదరాబాద్ :** హైడ్రా పేరిట జరుగుతున్న అరాచకాలు ప్రజలు గమనించాలని కోరారు. ఈ సందర్భంగా సోమాజీ గూడాలో ప్రెస్ క్లబ్ లో మీట్ ద ప్రెస్ కార్యక్రమంలో హరీశ్ రావు మాట్లాడుతూ..జూబ్లీహిల్స్ ఉపఎన్నిక.. వికాసం- విధ్వంసానికి మధ్య ఎన్నిక జరగబోతుందని తెలియజేశారు. వికాసం గెలవాలా? విధ్వంసం గెలవాలో? ప్రజలు నిర్ణయించుకోవాలని అన్నారు. రేవంత్ రెడ్డి పాలనకు జూబ్లీహిల్స్ ప్రజలు తీర్పు ఇవ్వబోతున్నారని, కాంగ్రెస్‌ను ఓడించకపోతే మరో మూడేళ్లు నరకయాతన అనుభవించాలని హెచ్చరించారు. మాజీ సిఎం కెసిఆర్ పాలనలో వికాసం అని.. కొనియాడారు. రేవంత్ రెడ్డి పాలనలో విధ్వంసం అని కెసిఆర్ అందించిన పథకాలు ఒక్కొక్కటీ రద్దవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి హయాంలో బ్లాక్ మెయిల్ పాలన జరుగుతోందని, పారిశ్రామికవేత్తలను రేవంత్ రెడ్డి ఎలా బ్లాక్ మెయిల్ చేశారో అందరికీ తెలుసు అని హరీశ్ రావు అన్నారు. కళాశాలలు నడపలేకపోతున్నామని.. యాజమాన్యాలు నిరవధిక సమ్మెకు దిగాయని, బకాయిలు విడుదల చేయక.. సమ్మె చేయనీయకుండా కాంగ్రెస్ బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. నిరవధిక సమ్మెకు దిగిన కళాశాలల్లో విజిలెన్స్ సోదాలు చేస్తున్నారని, ఆరోగ్యశ్రీ బకాయిలు విడుదల చేయకపోతే సమ్మె నోటీసు ఇచ్చారని అన్నారు. సమ్మె నోటీసు ఇస్తే ఆస్పత్రులకు నోటీసులు.. మున్సిపల్, విజిలెన్స్ దాడులు చేస్తున్నారని హరీశ్ రావు మండిపడ్డారు.

## నర్సాపూర్‌లో కోతుల బెడద

## తగ్గించేందుకు కొత్త ప్లాన్

**మెదక్ :** నర్సాపూర్ లో కోతుల బెడద తగ్గించేందుకు కొత్త ప్లాన్ వేసారు. స్థానిక యువత గెరిల్లా గెటప్ తో కోతులను తరుముతున్నారు. వానర మూక కొన్నాళ్లుగా నర్సాపూర్ లో బీభత్సం సృష్టిస్తుంది. ఎంత చేసినా కోతుల బాధ తప్పకపోవడంతో యూ ట్యూబ్ లో చూసి పరిష్కార మార్గం కనుగొన్నారు. గెరిల్లా గెటప్ వేసుకున్న వ్యక్తిని చూసి కోతులు పారిపోతున్నారు.

## బీసీ నేతల ముందస్తు అరెస్టు

**కరీంనగర్ :** గవర్నర్ పర్యటన సందర్భంగా బీసీ సంఘాల ప్రతినిధులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లుకు గవర్నర్ ఆమోదం చేయాలని బీసీ సంఘాల డిమాండ్ చేస్తున్నాయి. ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల కోసం ప్రైవేట్ కళాశాల బంద్ కు సంఘీభావంగా విద్యార్థులు నిరసన తెలిపే అవకాశం వుందని సమాచారం.

## అక్కడ అంతిమయాత్ర అతి కష్టం

## వరద నీటిలో శవయాత్ర తప్పనిసరి

**కరీంనగర్ :** జమ్మికుంట మండలం వావిలాలలో అంత్యక్రియలు అతి కష్టంగా మారాయి. దారిలేక పట్టించుకునే వారు కానరక నడుంమంటి వరద నీటిలో శవయాత్ర నిర్వహించే దుస్థితి ఏర్పడింది. వావిలాలకు చెందిన పుర్మ సంపత్ అనారోగ్యంతో మృతి చెందగా అంత్యక్రియలు నిర్వహించడం సాహసమే అయింది. వావిలాలలోని శ్మశానవాటికకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శవయాత్ర వెళ్లే మార్గం మధ్యలో చెరువు మత్తడి పారుతుండటంతో మృతదేహాన్ని మోసేవారితో పాటు కుటుంబీకులు, బంధువులు నానాతంటాలు పడ్డారు. నీటి ఉధృతికి ఎక్కడ కొట్టుకుపోతామోనన్న భయంతో ప్రాణాలలు అరచేత పెట్టుకుని మత్తడి దాటారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం కలకలం సృష్టిస్తుంది. మత్తడి వద్ద వంతెన నిర్మించాలని విన్నవిస్తున్నా పట్టించుకునే వారే లేకపోవటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదని స్థానికుల ఆవేదనతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్మశానవాటికలో అసౌకర్యాలతో పలు మృతదేహాలను చెరువు కట్ట సమీపం లోనే దహనం చేయాల్సి వస్తుందంటున్నారు. ఇప్పటికైనా స్మశాన వాటికకు సరైన దారి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

## కోరుట్ల శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో

## వందేమాతరం గీతాలాపన

**కోరుట్ల :** వందేమాతరం గీతం రచించి 150 సంవత్సరాలు నిండిన సందర్భంగా విద్యాశాఖ అధికారులు ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ విద్యార్థినీ, విద్యార్థులు,ఉపాధ్యాయులు వందేమాతరం గేయాన్ని ఆలపించారు.ఈ సంధర్భంగాపాఠశాల ప్రధాన ఆచార్యులు గోపు వెంకటేష్ మాట్లాడుతూఆనాడు స్వాతంత్ర పోరాటంలో బంకిం చంద్రఛటర్జీ ప్రజలలో దేశభక్తిని,స్వాతంత్ర ఉద్యమంలో ప్రజలను ఉత్తేజ పరచడానికి వందేమాతరం గేయాన్ని రచించి ప్రజల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపారనీ తెలియజేశారు.



# ప్రేమ అంటే సంకెళ్లు కావు.. గాయమైన మనసును..


ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాలో నటనకు రష్మిక మందన్నాకు జాతీయ అవార్డు రావాల్సిందే! నిన్నటివరకు ఇది అల్లు అరవింద్ మాట.. కానీ, ఈ సినిమా చూశాక చాలామందిదీ ఇదే మాట! రష్మికకు అవార్డు ఇచ్చి తీరాల్సిందే.. అంత అద్భుతంగా నటించింది అని కొనియాడుతున్నారు. రష్మిక మందన్నా, దీక్షిత్ శెట్టి ప్రధాన పాత్రలో నటించిన మూవీ ది గర్ల్‌ఫ్రెండ్. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన ఈ మూవీ నేడు (నవంబర్ 7న) ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా రష్మిక సోషల్ మీడియా వేదికగా ఓ లవ్ లెటర్ రాసింది. అమ్మాయిలందరికీ దాన్ని అంకితమిచ్చింది. అందులో ఏముందంటే.. స్త్రీగా ఎదుగుతున్న అమ్మాయిలందరికీ నా ప్రేమలేఖ.. 'నీకేం తెలుసు?' అన్న ప్రశ్న ఎదుర్కొనే ప్రతి అమ్మాయి 'తనకేం కావాలో బాగా తెలుసు' అనే స్థాయికి చేరుకుంటుంది. ఈ జర్నీ చిన్నదేమీ కాదు.

**ప్రేమ అంటే బంధీ అవడం కాదు**

నువ్వు ఎంతోదూరం వచ్చావ్.. ఇప్పటికైనా నిన్ను నువ్వు ప్రేమించు, నిన్ను చూసి నువ్వు గర్వపడు. ఇలాంటి అమ్మాయిలకు అండగా నిలబడిన అబ్బాయిలు.. మీ ప్రేమ వల్లే తాను ఇంత ధైర్యంగా నిలబడగలిగింది. ప్రేమలో ఎవరూ మాట్లాడని విషయాల గురించి ఈ సినిమా చర్చిస్తుంది. ప్రేమ అంటే హద్దులు గీసుకుని బంధీ అవడం కాదు, స్వేచ్ఛగా జీవించడం.. ఎన్ని గాయాలైనా సరే.. మనసును తేలిక చేసుకుని ధైర్యంగా ముందుకు సాగడం.

**మిమ్మల్ని మీరు ప్రేమించండి**

నా ప్రాణం పెట్టి ఈ సినిమా చేశాను. ఈ సినిమా మీ మనసును తాకుతుందని, మీ బలాన్ని మీకు గుర్తు చేస్తుందని ఆశిస్తున్నాను. మిమ్మల్ని మీరు ప్రేమిస్తారని అనుకుంటున్నాను. అదే గనక నిజమైతే నా ఆశయం నెరవేరినట్లే! నిశ్శబ్దాన్ని చీల్చుకుని ధృడసంకల్పంతో ముందడుగు వేసేవారికి.. వారిని వెన్ను తట్టి ప్రోత్సహించే వారికోసమే నా ఈ ప్రేమలేఖ అని ట్వీట్ చేసింది. ఈ లవ్ లెటర్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.




# మలయాళంలో ఎంట్రీ ఇస్తున్న అనుష్క

## 'కథనార్' నుంచి ఫస్ట్ లుక్ విడుదల

టాలీవుడ్ భామ అనుష్క శెట్టి మలయాళం ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వబోతున్న సంగతి తెలిసిందే. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం కథనార్ ఈ సినిమాకు రోజిన్ థామస్ దర్శకత్వం వహిస్తుండగా.. ప్రముఖ నిర్మాత గోకులం గోపాలన్ నిర్మిస్తున్నాడు. హారర్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం రాబోతుండగా.. ఈ చిత్రంలో జయసూర్య, ప్రభుదేవ, ప్రేమదేశం వినీత్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే నేడు అనుష్క శెట్టి పుట్టినరోజు సందర్భంగా ఆమెకి శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం అనుష్క ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది. ఈ చిత్రంలో అనుష్కా నీలా అనే పాత్రలో కనిపించబోతున్నట్లు ప్రకటించింది.

## భారత పేసర్ల జోరుకు తలొగ్గిన సఫారీలు..

# పంత్ సేనకు భారీ ఆధిక్యం!

రెండో అనధికారిక టెస్టులో భారత 'ఏ' జట్టు పట్టు బిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో ధ్రువ్ జురెల్(132 నాటౌట్) శతకంతో కోలుకున్న టీమిండియాను పేసర్లు గట్టెక్కించారు. ప్రసిధ్ కృష్ణ(3-35), ఆకాశ్ దీప్(2-28)లు నిప్పులు చెరగగా దక్షిణాఫ్రికాను 221కే ఆలౌట్ చేసి టీమిండియా ఆ తర్వాత భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. రెండోరోజు ఆట ముగిసే సరికి ఓపెనర్ కేఎల్ రాహుల్( 26 నాటౌట్), నైట్‌వాచ్‌మన్ కుల్దీప్ యాదవ్‌లు క్రీజులో ఉన్నారు. 3 వికెట్ల నష్టానికి 73 రుగులు చేసిన పంత్ బృందం ఆధిక్యం 112 పరుగులకు చేరింది. సంచలన ఆటతో మొదటి అనధికారిక టెస్టును హస్తగతం చేసుకున్న భారత ఏ జట్టు రెండో మ్యాచ్‌లోనూ పటిష్ట స్థితిలో నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో టాపార్డర్ విఫలమైనా.. ధ్రువ్ జురెల్(132 నాటౌట్) సూపర్ సెంచరీతో ఆదుకోగా.. భారత పేసర్లు వికెట్ల వేటతో సఫారీలను హడలెత్తించారు. ప్రసిధ్ కృష్ణ(3-35), ఆకాశ్ దీప్(2-28)లు చెలరేగగా.. సీనియర్ టీమ్ సారథి తెంబా బవుమా(0)



డకౌట్‌గా వెనుదిరిగాడు. టాపార్డర్ కుప్పకూలినా కెప్టెన్ ఎంజే అకెర్‌మన్(134) టీమిండియా పేసర్లను దీటుగా ఎదుర్కొని అద్భుత శతకంతో రాణించాడు. కానీ, అతడికి సహకారం అందించేవారు కరువవ్వడంతో 221కే ఆలౌటయ్యింది.

**జురెల్ ఒంటరి పోరాటంతో**

తొలి ఇన్నింగ్స్‌లో సఫారీ పేసర్ టియాన్ వాన్ వురేన్ (4-54) ధాటికి భారత ప్రధాన ఆటగాళ్లు చేతులెత్తేశారు. భారీ స్కోర్లు చేస్తారనుకుంటే కేఎల్ రాహుల్(19), కెప్టెన్ రిషభ్ పంత్(24)లు నిరాశపరచగా.. జట్టును గట్టెక్కించే బాధ్యతను భుజాన వేసుకున్న జురెల్ గొప్ప ఇన్నింగ్స్ ఆడాడు. 119-6తో ఆలౌట్ అంచున నిలిచిన జట్టు ఆపద్బాదంవుడి పాత్ర పోషించిన జురెల్ టెయిలెండర్లు కుల్దీప్ యాదవ్(20), మహమ్మద్ సిరాజ్(15)లతో విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పాడు. అయితే ప్రసిధ్ కృష్ణ(0)ను ఔట్ చేసిన వురేన్ 255 వద్ద భారత ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

## మొహ్సిన్ నఖ్వీ ద్వంద్వ పాత్ర.. ఫిర్యాదు చేయనున్న బీసీసీఐ.. అదే జరిగితే ఏసీసీకి కొత్త ఛైర్మన్..!

ఆసియా కప్ ముగిసి దాదాపు ఆరువారాలు గడిచింది. ఇంకా ట్రోఫీని ఏసీసీ భారత జట్టుకు అప్పగించలేదు. సెప్టెంబర్ 28న సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత జట్టు దుబాయి ఇంటర్‌నేషనల్ స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో పాక్‌ను ఐదు వికెట్ల తేడాత ఓడించి.. తొమ్మిదోసారి ఆసియా కప్ టైటిల్‌ను సాధించింది. అయితే, మ్యాచ్ తర్వాత ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నది. క్రికెట్ ప్రపంచాన్ని షాక్‌కు గురి చేశాయి. పీసీబీ ఛైర్మన్, పాక్ మంత్రి మొహ్సిన్ నఖ్వీ నుంచి ట్రోఫీని అందుకునేందుకు భారత జట్టు నిరాకరించింది. దాంతో ఏసీసీ అధ్యక్షుడుగా నఖ్వీ తానే ట్రోఫీని ఇస్తానని భీష్మించారు. టీమిండియా అందుకు నిరాకరించడంతో ఆయన ట్రోఫీని హోటల్‌కు తీసుకు వెళ్లడం వివాదాస్పదమైంది. అయితే, నఖ్వీ ద్వంద్వ పాత్ర వివాదానికి దారి తీసింది. టెలికాం ఆసియా స్పోర్ట్స్‌లోని ఓ నివేదిక ప్రకారం.. దుబాయిలో జరుగనున్న ఐసీసీ క్రికెట్ బోర్డు సమావేశంలో బీసీసీఐ మొత్తం సమస్యను లేవనెత్తబోతున్నది. మొహ్సిన్ నఖ్వీపై ఆరోపణల జాబితాను బీసీసీఐ సిద్ధం చేసింది. ఆయన అనర్హతను ప్రశ్నించే తీర్మానాన్ని ప్రవేశపెట్టబోతోందని నివేదిక పేర్కొంది. ప్రభుత్వ పదవి, క్రీడా పరిపాలన పదవి రెండింటిని ఒకేసారి కలిగి ఉండడం ఐసీసీ నిబంధనలను ఉల్లంఘించడమేనని బీసీసీఐ పేర్కొంటున్నది. అయితే, ఆసియా కప్ ట్రోఫీ అప్పగింతపై ఇంకా పరిస్థితి అస్పష్టంగానే ఉన్నది. ఈ విషయంపై ఇప్పటికే ఏసీసీకి అధికారిక లేఖ పంపామని.. ఇప్పటి వరకు స్పందన రాలేదని బీసీసీఐ దేవజిత్ సైకియా ఇటీవల వెల్లడించారు. శుక్రవారం




జరిగే ఐసీసీ బోర్డు సమావేశంలో బీసీసీఐ అధికారికంగా ఈ విషయాన్ని లేవనెత్తుతుందని పలు నివేదికలు తెలిపాయి. ట్రోఫీని పంపడంలో ఆలస్యంపై బోర్డు తీవ్రంగా పరిగణిస్తున్నది. ఇది క్రీడా స్ఫూర్తికి విరుద్ధమని.. సంస్థాగత పారదర్శకతకు విరుద్ధంగా ఉందని సైకియా పేర్కొన్నారు. పాకిస్తాన్ సైనిక చర్యలు ముగ్గురు ఆఫ్ఘన్ దేశీయ క్రికెటర్లు మరణించిన తర్వాత పాక్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య సంబంధాలు ఇటీవల క్షీణించాయి. తర్వాత పాక్‌లో జరుగనున్న ముక్కోణపు సిరీస్‌లో ఆఫ్ఘనిస్తాన్ వైదొలిగింది. ఆసియా కప్ ముగిసిన తర్వాత భారత జట్టు మైదానంలోనే ఉండిపోయింది. కప్ లేకుండానే సంబరాలు చేసుకుంది. ట్రోఫీని అందించేందుకు నఖ్వీ వేదికపై చేరుకున్న సమయంలో భారత ఆటగాళ్లు స్పందించలేదు. దాంతో నఖ్వీ ట్రోఫీతో హోటల్‌కు వెళ్లిపోయాడు. ఆ తర్వాత టీమిండియా ట్రోఫీ, మెడల్స్ లేకుండానే భారత్‌కు వచ్చింది. ఇలా జరుగడం క్రికెట్ చరిత్రలోనే తొలిసారి. భారత్-పాక్ క్రికెట్ సంబంధాలు మరింత దెబ్బతీయడమే కాకుండా.. ఆసియా క్రికెట్ కౌన్సిల్ విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తాజాగా ఐసీసీ బోర్డు సమావేశం జరుగుతుండడంతో బీసీసీఐ అధికారికంగా ఈ సమస్యను లేవనెత్తనున్నది. ఈ అంశం ఆసియా కప్ ట్రోఫీని తిరిగి ఇవ్వడంతో పాటు మొహ్సిన్ నఖ్వీ ద్వంద పాత్రలపై సైతం దృష్టి సారించే అవకాశం ఉంది. ఐసీసీ తీవ్రంగా పరిగణిస్తే రాబోయే రోజుల్లో ఏసీసీలో కీలక మార్పులు జరుగనున్నాయి.

# స్పోర్ట్స్

## 'గిల్ కోసం బలి.. సంజూను కాదని జితేశ్ శర్మను అందుకే ఆడిస్తున్నారు'



ఆసియా కప్-2025 సందర్భంగా భారత టీ20 జట్టులోకి శుబ్‌మన్ గిల్ తిరిగి వచ్చిన నాటి నుంచి సంజూ శాంసన్ చిక్కుల్లో పడ్డాడు. గిల్ గైర్హాజరీలో దాదాపు ఏడాది పాటు ఓపెనర్‌గా అదరగొట్టిన ఈ కేరళ బ్యాటర్‌కు ఇప్పుడు తుదిజట్టులో చోటే కరువయ్యే పరిస్థితి నెలకొంది. ఒకవేళ ప్లేయింగ్ ఎలెవన్‌కు ఎంపికైనా.. ఏ స్థానంలో బ్యాటింగ్‌కు రావాలో ఆఖరి నిమిషం వరకు తనకే తెలియని దుస్థితి. ఆస్ట్రేలియా తాజా పర్యటన లో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి టీ20 వర్షార్పణం కాగా.. రెండో టీ20లో సంజూ ను వన్‌డౌన్‌లో ఆడించారు. అయితే, ఈ స్థానంలో సంజూ దారుణంగా విఫలమయ్యాడు. కేవలం రెండు పరుగులే చేసి నాథన్ ఎల్లిస్ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. ఈ క్రమంలో మూడో టీ20 నుంచి సంజూను తప్పించిన యాజమాన్యం అతడి స్థానంలో మరో వికెట్ కీపర్ బ్యాటర్ జితేశ్ శర్మకు చోటు కల్పించింది. ఏడో స్థానంలో వచ్చిన జితేశ్ 13 బంతుల్లో 22 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఇక నాలుగో టీ20లో మాత్రం కేవలం మూడే పరుగులు చేసి నిష్క్రమించాడు. ఇదిలా ఉంటే.. ఆసీస్‌తో నాలుగో టీ20లో టీమిండియా మేనేజ్‌మెంట్ మరో ప్రయోగం చేసింది. ఆల్‌రౌండర్ శివం దూబేను మూడో స్థానంలో పంపింది. ఈ పరిణామాల నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్ మొహమ్మద్ కైఫ్.. గిల్, సంజూ, జితేశ్‌లతో పాటు యశస్వి జైస్వాల్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశాడు. "ఒకవేళ సంజూ శాంసన్ తుదిజట్టులో ఉంటే బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎలాంటి కన్ఫ్యూజన్ ఉండదు. అయితే, వైస్ కెప్టెన్ హోదాలో శుబ్‌మన్ గిల్ అన్ని మ్యాచ్‌లు ఆడటం ఖాయం. అందుకే సంజూను పక్కనపెట్టారు. ఇక ఐదు లేదంటే ఆరో స్థానంలో ఫినిషర్‌గా.. సంజూ కంటే జితేశ్ మెరుగు అని భావించి అతడి వైపు మేనేజ్‌మెంట్ మొగ్గు చూపుతోంది. గిల్ కాబోయే కెప్టెన్ కాబట్టి సంజూకు ఇక స్థానం దక్కకపోవచ్చు. ఏదేమైనా సంజూ రికార్డు అద్భుతంగా ఉంది. 150కి పైగా స్ట్రైక్‌రేటుతో అతడు పరుగులు రాబట్టాడు. కానీ ఇప్పుడు ఏ స్థానంలో ఎవరు బెటర్ అన్న అంశం ఆధారంగానే జట్టును ఎంపిక చేస్తున్నారు కాబట్టి సంజూకు అవకాశం దక్కడం లేదు. గిల్ టీ20లలో మరీ అంత తీసిపారేసే బ్యాటరేమీ కాదు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ ఓపెనర్‌గా మెరుగ్గా ఆడుతున్నాడు. కానీ అంతర్జాతీ య ఫార్మాట్లోనే విఫలమవుతున్నాడు. భారీ ఇన్నింగ్స్ ఆడితే తప్ప అతడిపై విమర్శలు ఆగవు.

**సంజూతో పాటు జైసూ జట్టులోకి!**

అప్పుడే సంజూ, యశస్వి జైస్వాల్ గురించి ఎవరూ మాట్లాడరు. సౌతాఫ్రికాతో స్వదేశంలో టీ20 సిరీస్‌లో గిల్‌కు విశ్రాంతినిచ్చే అవకాశం ఉంది. కాబట్టి ఓపెనింగ్ స్థానంలో సంజూ, జైసూ జట్టులోకి రావొచ్చు. వీరిద్దరు గనుక మరోసారి నిరూపించుకుంటే.. వరల్డ్‌కప్ రేసులో తప్పక ఉంటారు" అని కైఫ్ అభిప్రాయపడ్డాడు. కాగా ఆసీస్‌తో నాలుగు టీ20లలో కలిపి గిల్ కేవలం 103 పరుగులు రాబట్టాడు. ఈ సిరీస్‌లో భారత్ 2-1తో ముందంజలో ఉండగా.. ఇరుజట్ల మధ్య నిర్ణయాత్మక శనివారం నాటి ఐదో టీ20కి గబ్బా వేదిక.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.